కొత్తపల్లి

పిల్లల కథల పుస్తకం



57

కొత్తపల్లి పిల్లల కథల పుస్తకం-57 జనవరి 2013

మూలం: http://kottapalli.in/2013/1/welcome

మొత్తం ప్రతుల సంఖ్య: 2000

సంపాదకులు: నారాయణ

ముఖచిత్రం 'సంక్రాంతిముగ్గు': వీరాంజనేయులు

అక్షర కూర్పు: *కొత్తపల్లి*

వెల:రూ.25/-

కొత్తపల్లి ప్రచురణలు

యంఆర్‌వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి- 515 101, అనంతపురం జిల్లా.

ఫోను: 08559 240222, 7702877670 ఇ-మెయిలు: team@kottapalli.in



విషయ సూచిక

మాట తీరు

మాట తీరును గురించి ఓ చక్కని కథ ఉంది-

సుబ్బారాయుడికి నాలుగెకరాల భూమి ఉంది. అతనికి ఇద్దరు కొడుకులు- రాము, సోము.

సుబ్బారాయుడు ముసలివాడయ్యాడు. కొడుకులిద్దరూ పెద్దవాళ్ళయ్యారు. ఇద్దరూ పెద్దగా చదువుకోలేదు గానీ, పట్నంలో పనిచేసుకుంటూ ఎవరి బ్రతుకు వాళ్ళు బ్రతుకుతున్నారు.

సుబ్బారాయుడికి ఉన్న బెంగల్లా ఆ భూమి గురించే. భూమిని తను కొడుకులకు ఇచ్చినా, వాళ్ళు దాన్ని సాకలేక ఏదో ఒక ధరకు తెగనమ్ముతారేమో, డబ్బుల్ని పంచుకొని తింటారేమో- అని అతని భయం. కొడుకులిద్దరిలోనూ కనీసం ఒకరన్నా "నాన్నా, పొలం పని నేను చూస్తాను; మేం దాన్ని అమ్మం, నమ్ము" అనాలని అతని కోరిక.

అంతలోనే అనుకోకుండా పండక్కి ఇంటికొచ్చారు రాము-సోము. అదే రోజున పొలం దున్నేందుకు మనుషులూ వచ్చారు.

సుబ్బారాయుడు చిన్నకొడుకు సోముని పిలిచి చెప్పాడు- "ఎలాగూ వచ్చావు- కాస్త పొలం దున్నించు నాయనా, కూలోళ్ళు వచ్చారు" అని. చిన్నోడు సరేనని బయటికెళ్ళి, కూలోళ్ళతో "పొండి, పోయి త్వరత్వరగా పొలం దున్నేసి రండి" అన్నాడు. వెంటనే వెనక్కి తిరిగి వచ్చి "పంపించాను నాన్నగారూ" అని చెప్పి పోయాడు కూడాను.

కొంతసేపటికి పెద్దవాడు రాము కనబడ్డాడు సుబ్బారాయుడికి. "ఎలాగూ వచ్చారు- కొంచెం పొలం దున్నించి పొండి నాయనా. ఇందాక తమ్ముడికీ అదే చెప్పాను- కూలోళ్ళు ఇంకా పనికి ఒంగినట్లు లేరు" అన్నాడాయన రాముతో.

రాము బయటికి వెళ్ళి చూశాడు. కూలోళ్ళు ఇంకా అక్కడే తారట్లాడుతూ కనబడ్డారు. "ఏంటి,

ఇంకా ఇక్కడే ఉన్నారా?! పదండి, పోయి త్వరగా పొలం దున్ని వచ్చేద్దాం" అన్నాడు రాము, తనూ చెప్పులు వేసుకుంటూ.

కూలోళ్ళు రాము వెంట కదిలారు.

పెద్దకొడుకు చేతుల్లోతన భూమి భద్రంగా ఉంటుందని సుబ్బారాయుడికి నమ్మకం చిక్కింది. పొలాన్ని రాము నిర్వహించేటట్లూ, ఆదాయంలో రెండు వంతులు తను ఉంచుకొని, మూడో వంతును సోముకు ఇచ్చేటట్లూ పత్రాలు రాయించాడు తృప్తిగా.

పనులు చక్కగా జరగాలంటే అందర్నీ కలుపుకుపోవటం అవసరం. అది జరగాలంటే మన మాట తీరు దానికి అనుగుణంగా ఉండాలి. "పో, పోయి పని చెయ్యి" అనటానికీ, "రా, కలిసి పనిచేద్దాం" అనటానికీ చాలా వ్యత్యాసం ఉంది. మరి, ఈ సంవత్సరం అంతా మన మాట తీరులో ఏం లోపాలున్నాయో గుర్తించి వాటిని సరిచేసుకుందాం- సరేనా?


నూతన ఆంగ్ల సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలతో,

కొత్తపల్లి బృందం

<u>మనవి</u>

ఈ మధ్య కాలంలో విపరీతంగా పెరిగిన ముద్రణ, నిర్వహణ ఖర్చుల కారణంగా కొత్తపల్లి కథల పుస్తకం ముద్రిత ప్రతి వెలను పెంచక తప్పటం లేదు. పాఠకులు సహృదయంతో గతంలోలాగే ఆదరిస్తారని ఆశిస్తున్నాం. పెరిగిన వెలలు కొత్తపల్లి కథల పుస్తకం- 57 నుండీ అమలులోకి వస్తాయి. ఇకపైన కొత్తపల్లి కథలపుస్తకం విడిప్రతి వెల: **25** రు.

12 పుస్తకాల వెల : **300** రు.



నీతి చంద్రిక

విగ్రహం(యుద్ధం)-14

జరిగిన కథ: హంసరాజుపైకి నెమలిరాజు దండెత్తింది. గూఢచర్యంకోసం కాకిని ఎవరికీ తెలీకుండా ముందుగా పంపింది. ఆ వెనకనే చిలుకను ఒకదాన్ని దూతగా పంపింది. చిలుక వచ్చి హంసరాజు ముందు నిలబడి ధైర్యంగా తమ రాజు చెప్పమన్న మాటలు చెప్పింది. ఇక చదవండి, నీతిచంద్రిక-38 వ భాగం.

హంసరాజుతో చక్రవాక మంత్రి "ప్రభూ! సమయం అయింది- చక్కని ఈ చిలుక తమరి జవాబుకోసం వేచి ఉన్నది. ఇక దానిని ఇక్కడ నిలువనీయరాదు. తమరి మనసులోని నిశ్చయాన్ని తెలియబరచి, దాన్ని సత్వరం సాగనంపేది" అన్నది.

అప్పుడు హంసరాజు చిలుకవైపుకు తిరిగి- "ఓరీ! అరుణముఖా!నేను చెప్పే ఈ మాటలను జాగ్రత్తగా విను. నువ్వు వెళ్ళి నీ రాజు ఎదుట నిలబడగానే నోరు దాచుకొనక, నేను పలికిన పలుకులను నావిగా వినిపించు- "నీకు రాజ్య మదం బాగా తలకెక్కి, కాబోలు, మా దేశపునీటిపైన మనసు పడ్డావు. హిరణ్య గర్భుడి ప్రాణాలు నిలచి ఉండగా ఈ రాజ్యాన్ని

ఏలటం అనేది, నీకే ఏల- మూడు కన్నులున్న దొర- ఆ శివుడికి కూడా వీలుకాదు. మిణుగురు పురుగు సూర్యకాంతిపటలాన్ని దాటుకొని పోనెంచినట్లు, నువ్వు నా బలశౌర్యాలకు ఎదురు నిలచి పోరాడ-నెంచుతున్నట్లున్నది. ఒక్క చిత్ర వర్ణుడేం ఖర్మ, అట్లాంటి వాళ్ళు కోటిమంది ఒక్కసారిగా దండెత్తి వచ్చినప్పటికీ ప్రళయ కాలపు సూర్యుడి మాదిరి శత్రుపక్షపు బలాన్నీ శౌర్యాన్నీ హరిస్తూ వెలుగొందే హిరణ్యగర్భుడిని యుద్ధంలో తేరిపారనైనా చూడలేరు. నువ్వు నిజంగా పౌరుషశాలివే అయితే యుద్ధం చేసి మానుండి మా నేలను లాక్కోనటమే నీ పౌరుషానికి గుర్తింపు. అప్పుడు గదా, నీ మగటిమిని మేం మెచ్చుకునేది! ఎప్పుడైనా నీలాంటివాళ్ళ మాటలు కోటలు దాటుతుంటై గానీ కాళ్ళు గడప దాటవు. పనికిరాని బీరపు మాటలు కట్టిపెట్టు. శూరుడివై యుద్ధానికి రా. నీకోసం మృత్యువు ఇక్కడ ఎదురు-చూస్తున్నది.


లేకపోతే నువ్వు మరొక పని చెయ్యొచ్చు- నీ పిల్లతనపు మాటలను ప్రక్కనపెట్టి, 'తప్పయిపోయింది-క్షమించండి' అను. నేను నిన్ను వదిలిపెడతాను" అని గట్టిగా చెప్పింది.

చెప్పి, "మేం నీతో అన్న ఈ మాటలన్నిటినీ మీ దొరకు చెప్పినవి చెప్పినట్లు చెప్పాలి సుమా!" అని ఆ చిలుకకు కానుకలు ఇచ్చి, మంచి పళ్ళతో భోజనం పెట్టించి పంపింది.



ఆ చిలుక కూడా హంసరాజు వద్ద సెలవు తీసుకొని, "మా రాజు చెప్పమన్న మాటలు చెప్పాను తప్ప, మీవద్ద నేను ఏమీ ఎక్కువగా మాట్లాడలేదు. అయినా నేను ఎక్కడైనా మాటలు జారి ఉంటే క్షమించండి. నా వల్ల

మీకు చాలా శ్రమ కలిగింది. పోయి వస్తాను. నాకు ఇంకా ఏమైనా చెప్పేది ఉంటే తప్పక చెప్పగలరు" అని మర్యాదగా మాట్లాడి వెనక్కి తిరిగి పోయింది.



అట్లా బయలుదేరిన చిలుక ఆగకుండా ఎగిరి తమ దేశానికి పోయి, అలసట తీరేటట్లు కొంత విశ్రాంతి తీసుకొని, వెంటనే తమ రాజుగారి ఆస్థానానికి వెళ్ళింది. అది వెళ్ళే సరికి నెమలి రాజు చిత్రవర్ణుడు కొలువు దీరి ఉన్నాడు. చిలుక వెళ్ళి ప్రణామం చెయ్యగానే నెమలి విప్పారిన ముఖంతో దాన్ని ఆహ్వానిస్తూ "ఓ అరుణముఖా! కర్పూర ద్వీపానికి పోయి ఏ ఆపదల పాలయ్యావో అని కంగారు పడుతున్నాము. క్షేమంగా తిరిగి వచ్చావు. 'కదలని స్తంభం మాదిరి, నువ్వు ఏమైనా అక్కడే బందీవి అయ్యావేమో!'అని తామరాకు నీటికోసం తల్లడిల్లినట్లు ప్రతిక్షణం నీ రాకకోసమే ఎదురుచూస్తూ, నిముషం ఒక యుగంగా గడుపుతున్నాం. ఈ రోజున నిన్ను నిన్నుగా చూశాకగానీ మా మనసు శాంతించలేదు. మా కళ్ళు చల్లబడ్డాయి. చెప్పు. అక్కడి వార్తా విశేషాలు ఏమిటి? ఏదీ విడవకుండా అన్నిటినీ వివరంగా చెప్పు" అన్నది.

అప్పుడు చిలుక "ఆ రోజున తమరి ఆజ్ఞను అనుసరించి హిరణ్యగర్భుని వద్దకు వెళ్ళి, మాట్లాడి, అతను వెనక్కి పంపగా ఇప్పుడే వచ్చాను. వాళ్ళుండే ఆ దీవి చాలా అందంగా ఉంది. దాని అందాన్ని ఏమని వర్ణించను? మాటలకందని అందం ఆ దీవి సొంతం. ఎక్కడ చూసినా అప్సరసలతో కూడుకొని మనసును చల్లబరచే భూలోక స్వర్గం ఏదైనా ఉందంటే అది ఆ కర్పూర ద్వీపమే.

హిరణ్యగర్భుడు కూడా ఆత్మ రక్షణలో ఏలాంటి లోపమూ రానివ్వడు- తన శత్రువులందరినీ వేయి కళ్లతో పరిశీ-లిస్తుంటాడు. ఆ ద్వీపంలో ఉన్న పక్షులన్నిటికీ అసామాన్యమైన స్వదేశాభిమానం ఉన్నది. అవన్నీ తమ రాజును ఎక్కడలేని అనురాగంతో కొలుస్తున్నాయి. నాలాంటివాళ్ళు ఆ ద్వీపపు గొప్పతనంలో వందోవంతును కూడా వివరించలేరు- 'తెలిసినంత వరకు చెబుతాను' అన్నప్పటికీ, అట్లా చెప్పేందుకు కూడా చాలా రోజులు పడుతుంది.

అదంతా అటు ఉండనివ్వండి. నేను వెళ్ళేసరికి హిరణ్యగర్భుడు తమ మంత్రితో సమావేశంలోఉన్నాడట. ద్వారపాలకులకు నా పేరు చెప్పి, 'వచ్చానని విన్నవించండి' అని ఎన్ని విధాలుగా చెప్పినా 'మంచిది- చెబుతాం ఉండు' అంటూ ఉన్నారు తప్పిస్తే, ఎవ్వరూ కాలు కదల్పలేదు. తరువాత కొంత సేపటికి వాళ్ళలో కొందరు ఒక రెండు సార్లు లోనికి వెళ్ళి వచ్చి, 'ఇంకా అవ్వలేదు- ఇది సరైన సమయం కాదు- కొంచెం ఆగు' అంటూ ఆలస్యం చేశారు. ఆ తర్వాత మరికొంత సేపటికి వాళ్లలో ఒకడు లోపలినుండి వచ్చి 'ప్రభువులవారి సెలవైంది-రండి' అని నన్ను పిలుచుకొని పోయాడు.



ఆ సమయానికి ఆ పక్షిరాజు కొలువుతీరి ఉన్నాడు. తనను నిరంతరం సేవించే పక్షి సముదాయాలమధ్య పరివేష్టుడై, వారి సేవలను అందుకుంటూ, మరొక ప్రక్కన అంతరంగికులు చేసే మనవులను వింటూ ఉన్నాడు. లోనికి వెళ్ళిన నన్ను చూసి తగిన ఆసనంలో కూర్చోబెట్టి, నా రాకకు కారణం అడిగాడు.."అంటూ తను వెళ్ళినది మొదలు

హిరణ్యగర్భుడు చెప్పమన్న మాటలన్నిటినీ చెప్పింది. అక్కడ జరిగిన సంగతులన్నిటినీ ఒక క్రమంలో వివరంగా చెప్పి, ఇంకా ఇట్లా అన్నది- "అతను నన్ను ఇక్కడికి పంపేటప్పుడు చాలా పెద్దరికంతో వ్యవహరించాడు. నన్ను ఒక వంకన మర్యాదగా చూస్తూనే మరొక వంకన 'మీ రాజును యుద్ధానికి తీసుకురా' అని తొందరపెట్టాడు. అతను నిజంగానే శత్రువులకు అసాధ్యుడు.



అతని కొలువులోఉన్న సైనికులు కూడాయుద్ధ కౌశలం ఉన్నవారే. అయినా మన లోటును తీర్చి గెలుపు ఇచ్చేందుకు మన మేఘవర్ణుడు అక్కడే ఉన్నాడు. సందర్భానికి తగినట్లు, రాజుగారి మనసుకు సంతోషం కలిగించేది ఎలాగో అలా ప్రవర్తిస్తూ అతని ఆదరణకు పాత్రుడై ఉన్నాడు మన మేఘ వర్ణుడు. అక్కడ అతని పేరు నీలవర్ణుడు. నీలవర్ణుడు హంసరాజు నమ్మినబంట్లలో ఒకడుగా ఉన్నాడు. ఇక భయపడేందుకేమున్నది? దేవునిమీద భారంవేసి, 'ధర్మమే గెలుస్తుంది' అని యుద్ధానికి సన్నద్ధం అవ్వండి" అన్నది.

దాని మాటలు విని, చిత్రవర్ణుడు కొలువునంతటినీ కలయ చూస్తూ "విన్నారా, మీ చెవులారా? హిరణ్యగర్భుడి పొగరు మాటల చందం గమనించారా, మీరంతా? తానట, 'తప్పయిపోయింది-క్షమించండి' అంటే నన్ను వదిలేస్తాడట! అతనన్న ఆ మాట ఒక్కటే ములుకులా నా హృదయానికి గుచ్చుకొని సలుపుతున్నది. మదించిన ఏనుగుల కుంభస్థలాలను బ్రద్దలు కొట్టటంవల్ల గట్టిపడిన గోళ్లతో అలరారే కొదమ సింహం

ఏనాడైనా పచ్చగడ్డిని మేస్తుందా? ఈ చిత్రవర్ణుడు వేరొకరికి తలఒగ్గి, 'తమరి చిత్తం' అని కైమోడ్పటం కలలోనైనా సాధ్యమా? ఇక యుద్ధంకంటే ఉత్తమమైన పని వేరేదేదీ నా మనసుకు తట్టటం లేదు. ఇతరుల రాజ్యాలను జయించాలన్న కోరికకంటే, అతను నన్ను అన్న మాటల కరకుదనమే నన్ను ఎక్కువగా యుద్ధానికి రెచ్చగొడుతున్నది. నా పేరు వినబడితే పారిపోతున్న పాము కూడా కదిలేందుకు భయపడుతుందే, అట్లాంటి నాతో జగడం తలకెత్తుకుంటాడా, ఆ తెల్ల పిట్టల నాయకుడు ? ఎవరో వాడు-వీడు అనుకున్నట్లున్నాడు. చివరి రోజులు సమీపించి, పనికిరాని, వ్యర్థపు ప్రేలాపనలు పలుకుతున్నాడు.

శత్రుత్వాన్ని తుదముట్టించని వాళ్ల జన్మ దేనికి, వృధాగా? తనంతటి శత్రువు ఒక ప్రక్కన జీవించి ఉన్నాడంటే, పౌరుషం ఉన్నవాడికి ఆ పగ తెగేవరకూ కంటికి నిద్రరాదు, నోటికి ఏదీ రుచించదు, ఇతర సుఖాలేవీ మనసుకు పట్టవు. ఇక చెప్పపనిలేదు. మనం ఇప్పుడే జైత్ర యాత్రకు (గెలిచేందుకు చేసే యాత్ర)బయలు దేరి, శత్రువును హరించటమే పని. మీవంటి శూరుల సహాయ సంపత్తులు నావెంట ఉండగా , ఈ హిరణ్యగర్భుడు ఒక్కడు నాకెంతటివాడు? మూడు లోకాలూ ఒక్కటై నామీదికి దండెత్తి వచ్చినా భయపడేది లేదు... (...అని ఇంకా ఏమన్నదో తర్వాత చూద్దాం..)

'కం' వచ్చే కొన్ని పదాలు రాసి పంపింది లక్ష్మి....

పాకం పైకం తిలకం బింకం టంకం వంటకం కుంకం సుంకం జాతకం తూకం అమ్మకం పంపకం కలంకం భూటకం లోకం

మీరు మరిన్ని రాసి పంపండి చూద్దాం!



వడ్రంగి ఎంపిక

సేకరణ: తరుణిస్ఫూర్తి, 5 వతరగతి, ప్రభుత్వపాఠశాల, గడ్డంనాగేపల్లి, నార్పల.

భద్రాపురంలో ఉండే భీమయ్య ఇప్పుడు చాలా ధనవంతుడు. అతను చిన్నగా ఉన్నప్పుడు పేదరికంతో అనేక కష్టాలు పడ్డాడు. కానీ రేయింబవళ్ళూ చలి-ఎండ-వాన అనకుండా బాగా కష్టపడి పనిచేయటంతో కొంతకాలానికి ఒక చిన్న పొలం కొనుక్కోగలిగాడు. కాలం కలిసి రావ డంతో ఇప్పుడు బాగా ధనవంతుడు కూడా అయ్యాడు.

అతను ఇంతకాలమూ ఉన్న ఇల్లు చాలాచిన్నది, పాతబడింది కూడాను. ఇప్పుడు క్రొత్తగా పెద్ద ఇల్లు ఒకటి కట్టించుకోవాలనిపించింది భీమయ్యకు. కొత్త ఇంటికోసం పనివాళ్ళకు పనులన్నీ పురమాయించాడు . 'కిటికీలు, తలుపులు, కుర్చీలు, మంచాలు తయారుచేయ్యడానికి సరియైన వడ్రంగి ఎవరా' అనేది మటుకు

తేలలేదు.

దగ్గర్లోనే ముకుందాపురంలో వడ్రంగి పనిచేసేవాళ్ళు ఉన్నారని తెలుసుకొని అక్కడికి వెళ్ళాడు భీమయ్య. అక్కడ అతను సోమయ్య , రామయ్య , ఆత్మయ్య అనే ముగ్గురు వడ్రంగులనూ వేరువేరుగా కలిశాడు. "నాకు ఒక తెడ్డుకట్టె, ఒక పప్పు గిత్తె , ఒక కవ్వము, ఒక లత్తినకట్టె , ఒక చపాతీలు ఒత్తే కట్టె చేసిపెడతారా?" అన్నాడు. అందుకోసం 2 వారాల సమయంతోపాటు ముగ్గురికీ తలా కొంత సొమ్మునుకూడా ఇచ్చాడు.

మొదటివాడు ఆత్మయ్య నాలుగు వస్తువుల్నీ తయారుచేసుకుని వారం తిరక్కుండానే వచ్చాడు.

ఇచ్చిన సమయానికి 2 రోజులు ముందుగానే పని పూర్తిచేసి వచ్చాడు రామయ్య.

సోమయ్య మరోరెండు వారాల సమయం అదనంగా తీసుకున్నాడు. ఆలస్యంగానైనా వస్తువులు తీసుకొచ్చాడు.

వాళ్ళు తెచ్చిన వస్తువులన్నిటినీ పరిశీలించాక, భీమయ్య క్రొత్త ఇంటి చెక్క పనినంతా రామయ్యకు అప్పగించాడు.




ఇదంతా గమనిస్తున్న భీమయ్య కొడుకు అతన్ని అడిగాడు- 'ఇంటిపని అంతా రామయ్యకే ఎందుకు అప్పగించావు?' అని.

భీమయ్య నవ్వి, జవాబిచ్చాడు- "చూడు, ఆత్మయ్య ఖరీదైన చెక్కను వాడాడు. అందుకని పని సులభం అయ్యింది. కానీ అతనికి పనిలో నైపుణ్యం లేదు. అతను తయారు చేసిన వస్తువుల్లో అది కొట్టొచ్చినట్లు కనబడింది. ఇక సోమయ్యలో నైపుణ్యం


ఉంది. కానీ అతను వాడిన చెక్క నాసిరకంది. అంతేకాదు; అతను మాట నిలుపుకోక, పనిలో చాలా ఆలస్యం కూడా చేశాడు. అయితే రామయ్య వాడింది పనికి తగిన చెక్క. అంతే కాదు, అతని పనిలో నైపుణ్యం ఉంది. పనిని కూడా ఇచ్చిన గడువులో పూర్తి చేశాడు.- అర్థమైందా, పనికి అర్హత ఎవరికి ఉంటుందో?" అని.

కొడుకు అర్థమైనట్లు తలఊపాడు.

చమక్కులు







పంతులుగారి మంత్రాలు

సేకరణ: లక్ష్మీతేజ, 9 వ తరగతి, ప్రభుత్వోన్నత పాఠశాల, పాలకొండ, శ్రీకాకుళం జిల్లా.

అనగనగా ఒక ఊళ్ళో ఒక పెద్ద పంతులు ఉండేవాడు. గుళ్ళో పూజలు చేస్తూ బాగానే బ్రతికేవాడు ఆయన. ఆ పంతులికి ఒక్కడే కొడుకు. వాడు చాలా తెలివితక్కువవాడు. 'వాడిని ఏం చేద్దాం' అని ఆలోచించీ ఆలోచించీ ముసలివాడైపోయాడు పంతులు. చివరికి, 'పెళ్ళిచేసేస్తే సరి- వాడి భార్య వాడిని ఎలాగో ఒకలాగా మార్చుకొంటుందిలే'అనుకొని, పేదింటి అమ్మాయిని ఒకామెను తెచ్చి వెంగళప్పకిచ్చి పెళ్ళి చేశాడు. కొన్నిరోజులతరువాత ఆయన చనిపోయాడు కూడా.

కొన్నిరోజులుగడిచే సరికి భార్యకు అర్థమైంది- తన భర్త మంచివాడే, కానీ అమాయకుడు, బొత్తిగా చదువురాని వాడు. నమ్మి ఎవరైనా ఉద్యోగం ఇస్తే తప్ప, తనంతట తాను

బ్రతకలేడతను. కానీ ఏమంత్రమూ రాని వాడికి గుడినెవరు అప్పచెబుతారు? అందుకని ఆమె భర్తతో "ఏమండీ, మామయ్య ఇక లేరు. ఆయనకు ఉన్నంత పాండిత్యం మీరూ సంపాదించుకోవాలి. కాబట్టి మీరు ప్రయత్నించి కొన్ని మంత్రాలు నేర్చుకోండి ముందు" అన్నది.

చిన్నపంతులికి అట్లు అంటే చాలా ఇష్టం. 'సరే నేను చదువుకుంటాను-కానీ నాకు అట్లుపోసి ఇవ్వాలి ముందు' అన్నాడు అతను. భార్య వెంటనే అట్లుపోసి ఇచ్చింది. ఆ అట్లను తీసుకొని వెంగళప్ప మంత్రాలు నేర్చుకొనేందుకు బయలుదేరాడు.

ఆ ఊరిలోనే ఉన్న దొంగలు కొందరు అతను అలా వెళ్తుండటం చూశారు. "ఒరే, చిన్న పంతులు ఇవాళ్ళ ఎక్కడికో వెళ్తున్నాడు. పెద్ద పంతులు బాగా డబ్బు, బంగారం సంపాదించి పెట్టాడుగదా, వాటిని దొంగిలించాలంటే ఇవాళ్ల రాత్రే సరైన సమయం" అనుకున్నారు వాళ్ళు.

అయితే ఆ సంగతి తెలీదుకదా, చిన్న పంతులు అలా వెళ్తున్నాడు. అంతలో కొన్ని తాటిచెట్లుకనబడ్డాయతనికి. అవి అతన్ని ఆపి 'పంతులూ పంతులూ ఎక్కడికి వెళ్తున్నావ్?' అని అడిగాయి. 'నేను చదువు నేర్చుకోవడానికి వెళ్తున్నాను. అందుకు మా ఆవిడ అట్లు పోసి ఇచ్చింది' అన్నాడు పంతులు. తాటిచెట్లు చాలా సంతోషపడ్డాయి. 'అవునా, నువ్వు చదువు నేర్చుకునేందుకు వెళ్తున్నావా? అయితే మేమొక మంత్రం చెబుతాము. మాకొక అట్టు ఇస్తావా?' అన్నాయి. పంతులు అమాయకుడు కదా, 'సరే' అన్నాడు. అప్పుడు తాటిచెట్లు "తాటి చెట్లవలె నిలుచున్నావహే "అని ఒక మంత్రం చెప్పి పంపాయి. పంతులు తను అన్న మాట ప్రకారం వాటికి ఒక అట్టు ఇచ్చి 'తాటి చెట్ల వలె నిలుచున్నావహే'అనుకుంటూ బయలుదేరతాడు.

మళ్ళీ కొంత దూరం వెళ్ళే సరికి కొన్ని గువ్వలు కనిపించాయి అతనికి. 'పంతులూ పంతులూ ఎక్కడికి వెళ్తున్నావు?' అని అడిగాయి గువ్వలు. 'నేను చదువు నేర్చుకోవడానికి

వెళ్తున్నాను. అందుకు నా భార్య అట్లు పోసి ఇచ్చింది. తాటి చెట్లు ఒకమంత్రం చెబితే వాటికొక అట్టు ఇచ్చాను' అన్నాడు పంతులు. 'అయితే మేమూ ఒక మంత్రం చెబుతాము. మాకు ఒక అట్టు ఇస్తావా?' అడిగాయి గువ్వలు. 'సరే, చెప్పండి. ఎవరేది చెప్పినా నేర్చుకుంటాను' అన్నాడు పంతులు. 'గువ్వల వోలె కూర్చునున్నారహే' అని ఓ మంత్రం చెప్పాయి గువ్వలు. పంతులు సంతోషపడి వాటికొక అట్టు ఇచ్చి,'గువ్వల వోలె ఒదిగి కూర్చునున్నారహే' అనుకుంటూ బయలుదేరాడు.

మళ్ళీ కొంతదూరం వెళ్ళే సరికి కొన్ని ఎలుకలు ఎదురయ్యాయి అతనికి. ఆ ఎలుకలు 'పంతులూ పంతులూ ఎక్కడికి వెళ్తున్నావు?' అని అడిగాయి. అప్పుడు పంతులు 'చదువు నేర్చుకోవడానికి వెళ్తున్నాను. అందుకు నాభార్య అట్లుపోసి ఇచ్చింది. తాటిచెట్లుకనబడి ఒక మంత్రం చెబితే వాటికొక అట్టు ఇచ్చాను. తరువాతగువ్వలుకనిపించి ఒక మంత్రం చెబితే వాటికొక అట్టు ఇచ్చాను' అన్నాడు చిన్న పంతులు. 'అయితే మేమూ ఒక మంత్రం చెబుతాము. మాకు కూడా ఒక అట్టు ఇస్తావా?' అడిగాయి ఎలుకలు. పంతులు 'సరే, ఎవరు చెబితే ఏముంది చెప్పండి' అన్నాడు పంతులు. అప్పుడవి "ఎలుకల వోలె పాకుచున్నారహే " అని ఓ మంత్రం చెప్పాయి. పంతులు దాన్నీ నేర్చుకొని వాటికి ఒక అట్టు ఇచ్చి బయలుదేరాడు.

అట్లా వెళ్తుంటే కొన్ని జింకలు కనిపించాయతనికి. ఆ లేళ్ళు 'పంతులూ పంతులూ ఎక్కడికి వెళ్తున్నావు?' అని అడిగాయి అతన్ని. 'నేనుచదువు నేర్చుకోవడానికి వెళ్తున్నాను. అందుకు నాభార్య అట్లు పోసి ఇచ్చింది. దారిలో తాటి చెట్లు, ఎలుకలూ, గువ్వలు ఒక్కొక్క మంత్రం చెబితే వాటికి ఒక్కొక్క అట్టు ఇచ్చాను' అన్నాడు చిన్న పంతులు. అప్పుడు ఆ జింకలు 'మేమూ ఒక మంత్రం చెబుతాము. మాకొక అట్టు ఇవ్వు' అన్నాయి. 'సరే చెప్పండి'అన్నాడు చిన్న పంతులు. "లేళ్ళ వలె గెంతుచున్నారహే " అని ఓ మంత్రం చెప్పాయి

జింకలు. పంతులు వాటికీ ఒక అట్టు ఇచ్చేసాడు. మిగిలిన ఒక అట్టునూ తను తినేసాడు.

ఆ సరికి సాయంత్రం అయిపోయింది. ఇక 'చీకటిపడిపోతుందేమో' అని వెనక్కి తిరిగి ఇంటికి బయలుదేరాడు పంతులు. అతను ఇల్లు చేరుకునే సరికి నిజంగానే చీకటి పడిపోయింది. పంతులు భార్య వాకిట్లోనే ఎదురైంది- 'ఏమండీ, కొంచెం చదువు ఏమైనా నేర్చుకున్నారా? అట్లు తిన్నారా?' అని అడిగింది. పంతులు చాలా సంతోషంగా నవ్వుతూ, 'ఓ, నేను మంచి మంచి మంత్రాలు నేర్చుకున్నాను. నువ్వు మంచం మీద కూర్చో, నీకు వినిపిస్తాను' అన్నాడు.

భార్య కొంచెం మొహమాటంగా మంచం మీద కూర్చునే సమయానికి, ఇంటి వెనక నీడల్లో చేరి నిలబడ్డారు దొంగలు.

"తాటిచెట్లు వలె నిలుచున్నారహే " అని మొదటి మంత్రాన్నే పదిసార్లు గట్టిగా వల్లించటం మొదలెట్టాడు పంతులు.

పంతులు ఊరికెళ్ళాడు అనుకున్న దొంగలు బిత్తర పోయారు. 'ఇదేంటీ, పంతులుకి ఎలా తెలిసింది, మనం నిలబడి ఉన్నామని?' అని ఆ దొంగలు గబుక్కున గుబురులో కూర్చున్నారు.

అంతలో పంతులు రెండో మంత్రం మొదలు పెట్టాడు-"గువ్వల వోలె ఒదిగి కూర్చునున్నారహే " అని.

అక్కడ దొంగలు మళ్లీ వణికి పోయారు- 'ఇదేంటి, ఇలా చెప్పేస్తున్నాడు? మనం కనిపిస్తున్నామేమో. పదండి వేరే వైపుకు పోదాం' అని దొంగలు దూరంగా పాకటం మొదలు పెట్టారు. అంతలో పంతులు మూడో మంత్రం మొదలు పెట్టాడు- "ఎలుకల వోలె పాకుతున్నారహే" అని.

అది విన్న దొంగలు గబుక్కున లేచి నిలబడి, వెనక్కి తిరిగి పరుగెత్తటం మొదలు పెట్టారు- అంతలో పంతులు నాలుగో మంత్రం వల్లించసాగాడు- "లేళ్ల వలె గెంతుచున్నారహే" అని.

పంతులుఇంట్లోంచి పారిపోయిన దొంగలకి తమ సంగతి పంతులికి ఎలా తెలిసిందో ఎంత

ఆలోచించినా అర్థం కాలేదు. 'పంతులు ఏవో మంత్రాలు నేర్చుకున్నాడు' అని గురి కుదిరిపోయింది వాళ్లకు. వాళ్ళూ ఊళ్ళో వాళ్ళేగా? వాళ్ల ద్వారా ఊరి జనానికి పంతులు గొప్పదనం ఒక్కసారిగా తెలిసిపోయింది; గురి కుదిరిపోయింది. ఉదయం అయ్యేసరికి ఊరి జనాలంతా పంతులు గారి ఇంటికి వచ్చేశారు 'పంతులుగారూ! మీరే గుడికి పూజారిగా ఉండాలి' అంటూ. 'బెట్టు చేయకండి, ఒప్పుకోండి' అని భార్య సొంజ్ఞ చేసే సరికి, పంతులు 'సరే' అని ఒప్పుకున్నాడు. ఇక ఆ తర్వాత ఆలస్యం చేయకుండా మంచి మంచి మంత్రాలన్నీ త్వరత్వరగా నేర్చేసుకొని, ఆ గుడికి పంతులుగా కుదురుకున్నాడు హాయిగా!



ప్రశ్న: వెంగళప్ప కండక్టరుకు నోటును చింపి ఇచ్చాడు. ఎందుకు?

జవాబు: కండక్టరు వెంగళప్పకు టికెట్టును చించి ఇచ్చాడు మరి...!

తిక్క ప్రశ్న!

పట్టుదల

రచన: మక్సూద్, 6 వతరగతి, ప్రతిభ మోడల్‌స్కూల్, జహీరాబాద్.



రాజు, రవి ఇద్దరూ స్నేహితులు. వాళ్ల అమ్మానాన్నలు కూలిపని చేసి జీవించేవారు. అయినా రాజు వాళ్ల నాన్నకు చదువంటే ఇష్టం. తను ఎంత కష్టపడి పని చేసినా రాజును మాత్రం బడికి పంపేవాడు.

రవి వాళ్ల నాన్న మాత్రం మొండివాడు. రవిని బడికి పంపకుండా తనతోబాటు పనికి తీసుకెళ్లేవాడు. అయితే రవికి చదువంటే చాలా ఇష్టం. ప్రొద్దున పనికి పోతూనే, రాత్రిళ్లు రాజు దగ్గరికెళ్ళి చదువుకునేవాడు.





ఒకరోజు రవి వాళ్ల నాన్నకు వేరే ఊళ్ళో ఏదో పని పడింది. రవిని కూడా వెంటబెట్టుకొని పొరుగూరు వెళ్ళాడు. అక్కడ ఆయనకు బాగా దాహమైంది.

ఒక చెరువు కనబడితే నీళ్లు త్రాగుదామని వెళ్లారు ఇద్దరూ.



అక్కడ ఓ బోర్డుమీద వ్రాసి ఉన్నది:

'ఈ నీరు విషపూరితం' అని.

అయితే రవి వాళ్ల నాన్నకు చదువు రాదు కదా, బోర్డును పట్టించుకోకుండా ముందుకు వెళ్ళాడు- నీళ్ళు త్రాగేందుకు.

అంతలో బోర్డు ముందు నిలబడి, ఏం రాసి ఉందో గట్టిగా చదివాడు రవి. అది వినగానే రవి వాళ్ళ నాన్న గబుక్కున వెనక్కి తిరిగి వచ్చేసాడు. రవికి చదువు

రావటం వల్లనే తనకు ప్రాణాపాయం తప్పిందని గుర్తించాడు వాళ్ళ నాన్న. దాంతో ఆయన మనసు మారింది. 'చదువు వల్ల విజ్ఞానం పెరుగుతుంది' అని ఆయనకు అర్థం అయ్యింది.



చదువనేది మనిషికి ఎంత అవసరమో గుర్తించాడు రవి వాళ్ళ నాన్న.

ఆ మరుసటి రోజు నుండి రవిని బడికి పంపించ సాగాడు ఆయన. బడిలో రవి చక్కగా చదువుకున్నాడు. మంచి పేరు తెచ్చుకున్నాడు.

నవ్వు!

దోమ పగ!

పెద్దదోమ: అదిగో ఆ ఎర్రచొక్కా వాడున్నాడే, వాడ్ని బాగా కుట్టిరా!

చిన్నదోమ: మనుషులందరి రక్తం ఒకటేగా, వాడినే ఎందుకు కుట్టాలి?

పెద్దదోమ: వాడు మన ప్రధాన శత్రువు. దోమతెరల్ని అమ్ముతున్నాడు మరి!

పారిపోయిన గిన్నెలు

తెనాలి రామకృష్ణుడి కథలు తెలీనిదెవరికి? అయినా వాటిని ఎన్నిసార్లు గుర్తుచేసుకున్నా తనివి తీరదు. అట్లాంటి ఓ కథ, అరవింద్ మాటల్లో, మీకోసం..
సేకరణ: అరవింద్ రెడ్డి, 7 వతరగతి, శ్రీవిద్యానికేతన్ స్కూల్, ముకుందాపురం, అనంతపురంజిల్లా.

విజయనగర రాజ్యంలో వరహాలయ్య అనే వ్యాపారి ఉండేవాడు. ప్రజలు తమ అవసరాల కోసం అతని దగ్గర ఎక్కువ వడ్డీకి అప్పు తీసుకునేవారు. తీసుకున్న అప్పు తిరిగి చెల్లించడంలో కాస్త ఆలస్యమైతేచాలు- బలవంతంగా మరిన్ని ఎక్కువ డబ్బులు వసూలు చేసేవాడతను. అయినా ప్రజలకి మరో ఆధారం లేక, ఎంత ఇబ్బందిగా ఉన్నా అతన్నే ఆశ్రయిస్తూండేవాళ్ళు. పెళ్ళిళ్ళకు, పెద్ద వంటలకు అవసరమైన పాత్రల్ని కూడా అద్దెకు ఇచ్చేవాడు వరహాలయ్య. వాటిని తిరిగి ఇవ్వటంలో కాసింత ఆలస్యం అయినా, ఆ పాత్రలు పాతబడినా అతను చేసే గొడవకు అంతు ఉండేదికాదు. ఈ విషయం రాయలవారి ఆస్థానంలో ఉన్న తెనాలి రామకృష్ణుడికి తెలిసింది. ఎలాగైనా వరహాలయ్యకు బుద్ధి చెప్పాలనుకున్నాడు.

ఒక రోజున వరహాలయ్య దగ్గరికి వెళ్ళి "మా ఇంట్లో రేపు విందు జరగనున్నది- అన్నం వండడానికి ఒక పెద్ద గిన్నె కావాలి" అని అడిగాడు రామకృష్ణుడు.

వరహాలయ్యకు రామకృష్ణుడు పరిచయమే. అయినా " గిన్నెకు బాడుగగా పది బంగారు నాణేలు ఇవ్వండి. నాణాలు ముందుగా ఇస్తేనే గిన్నె అరువు ఇచ్చేది" అన్నాడు వరహాలయ్య.

"ఓహో! అట్లానా! పది బంగారు నాణాలు బాడుగ ఇవ్వాలా? అవునవునులెండి! మీ పద్ధతులు మీవి" అంటూ ముందుగా పది బంగారు నాణేలు చెల్లించి గిన్నెను తీసుకువెళ్ళాడు రామకృష్ణుడు.

రెండు రోజుల తరువాత వరహాలయ్య దగ్గరికి

రెండు గిన్నెలు పట్టుకెళ్ళాడు రామకృష్ణుడు. తను తీసుకెళ్ళిన గిన్నెతో పాటు మరో గిన్నెను కూడా వరహాలయ్యకు ఇస్తూ చెప్పాడు సంతోషంగా: "మీరు నాకు ఇచ్చారా, ఒక గిన్నె? అది చాలా బరువుగా ఉంటే, 'ఎందుకా' అనుకున్నాను. నిన్న రాత్రి దానికి ఈ గిన్నె పుట్టింది!" అని.

"రామకృష్ణుడు ఇంత అమాయకుడా?" అని వరహాలయ్య సంబరపడిపోయాడు. "అవునవును. అది గర్భంతో ఉండింది నీకు అద్దెకు ఇచ్చేటప్పటికి. 'నువ్వు తల్లిని, పిల్లని సరిగా వెనక్కి తెచ్చిస్తావా, లేదా' అని అనుమానించాను. మంచివాడివేలే!" అన్నాడు పైకి. "వీడు అసాధ్యుడు అని అందరూ చెబుతుంటారు, కానీ నాకు మాత్రం భలే లాభం కలిగించాడు"అని మనసులో అనుకుంటూ.

వారం రోజుల తర్వాత రామకృష్ణుడు వరహాలయ్య దగ్గరికి వెళ్ళాడు మళ్ళీ- "రేపు మా అమ్మగారి పేరు మీద అన్నదానం చేయాలనుకుంటున్నాను. నాకు కొన్ని గిన్నెలు కావాలి. ఇదివరకటిలాగే అద్దె చెల్లిస్తానులెండి" అన్నాడు.



రామకృష్ణుడిని చూడగానే వరహాలయ్య ముఖం వికసించింది. "కొన్ని కాదు; నా దగ్గర ఉన్న అన్ని గిన్నెలూ ఇస్తాను- తీసుకెళ్ళండి" అని తన ఇంట్లో ఉన్న గిన్నెలన్నిటినీ బండి మీద వేసి రామకృష్ణుడి ఇంటికి పంపించాడు సంతోషంగా- "ఈసారి తనకు ఎంత లాభం కలుగుతుందో" అని ఆశగా ఎదురూ చూస్తూ.

పది రోజులు గడిచిపోయాయి, కానీ రామకృష్ణుడు గిన్నెల్ని తిరిగి ఇవ్వనే లేదు!

చివరికి వరహాలయ్యే అతని ఇంటికి వెళ్ళి గిన్నెల గురించి అడిగాడు.

"అయ్యో! ఏం చెప్పేది! నువ్వు ఇచ్చిన గిన్నెలు రాత్రికి రాత్రే పారిపోయాయి. దాంతో మా ఇంట్లో కార్యం కూడా జరగకుండా అయ్యింది. నీ మీద రాజుగారికి ఫిర్యాదు చేద్దామనుకున్నానుగానీ, పోనిమ్మని ఊరుకున్నాను అంతే" చెప్పాడు రామకృష్ణుడు.

"గిన్నెలు పారిపోవడం ఏమిటి? అంతా మోసం!" అరిచాడు వరహాలయ్య. కానీ రామకృష్ణుడు తను చెప్పిందే చెబుతూ వచ్చాడు. ఇంక చేసేదేమీ లేక, రాయలవారి దగ్గర రామకృష్ణుడి మీద ఫిర్యాదు చేశాడు వరహాలయ్య.

రాయలవారు వరహాలయ్య గురించి ఆరా తీశారు. రామకృష్ణుణ్ణి పిలిపించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంగతంతా అర్థమయ్యాక, చిరునవ్వు నవ్వారు.

"నీ గిన్నెకు మరో గిన్నె పుట్టడం నిజమయినప్పుడు, ఆ గిన్నెలు పారిపోవడం నిజం ఎందుకు కాకూడదు?!" అని వరహాలయ్య ఫిర్యాదును కొట్టేశారు.

వరహాలయ్య సిగ్గుతో తల దించుకున్నాడు. తనకు బుద్ధి చెప్పడానికే రామకృష్ణుడు ఇలా చేశాడని అర్థం చేసుకున్నాడు. అప్పటి నుండి నీతిగా జీవించాడు.

కంటి బాధ!

రవి: శీనూ నీ ఒక చెవి కోస్తే?

శీను: సరిగ్గా వినపడదు.

రవి: మరి రెండు చెవులూ కోస్తే?

శీను: సరిగ్గా కనపడదు.

రవి: ఎందుకలా?

శీను: కళ్లజోడు పెట్టుకోలేనుగా...!

ఫీజు బాధ!

డాక్టర్: మీ గుండె చాలా నీరసంగా ఉంది. కాబట్టి మీకు బాధ కలిగించే పనులేవీ చేయకండి.

రోగి: అలాగే డాక్టర్! ముందుగా మీ ఫీజ్ కట్టటం మానేస్తాను!

బాధలు!

బైక్ కన్నా సైకిల్ మేలు

బొమ్మకు కథ రాశాను!

రచన: యం.చంద్రలేఖ, 9 వతరగతి, అరవిందాహైస్కూల్, కుంచనపల్లి, గుంటూరుజిల్లా.



రమేష్‌కి వేగంగా పోతుండటం అంటే చాలా ఇష్టం. మోటార్ బైకులు చాలా వేగంగా పోతాయి కదా, అందుకని అతనికి బైక్ రేస్ అంటే చాలా ఇష్టం . కానీ ఎంత ఇష్టం ఉన్నా, మరి అతనికి బండి లేదు. దాంతో చాలా బాధగా ఉండేది అతనికి.

అయితే కాలేజీలో డిగ్రీ చదువుకునే సమయంలో అతనికి ఒక అవకాశం వచ్చింది. వాళ్ళ కాలేజీ తరఫున అతను ఒక బైక్ రేస్ పోటీకి వెళ్ళగల్గాడు. అక్కడ పోటీ పెట్టిన కంపెనీ వాళ్ళే రేసింగ్ బైకులు కూడా ఇస్తారు. వాటినెక్కి ఎవరు ఎక్కువ వేగంగా వెళ్తారో, వాళ్ళకు అంత గొప్ప బహుమతి వస్తుంది. రమేష్ అందులో గెలిచాడు! ఐదు లక్షల రూపాయలు బహుమతిగా ఇచ్చారు వాళ్ళు!

రమేష్‌కి చాలా సంతోషం వేసింది- తన చదువుకు సరిపోయేంత డబ్బు వచ్చిపడిందని.

అయితే, అంతలోనే అతనికి ఆ డబ్బుతో సొంత బైక్ కొనుక్కోవాలని ఆశ పుట్టింది. ఆ పోటీకి వచ్చిన వాళ్లలో చాలా మందికి సొంత బళ్ళు ఉన్నాయి మరి! వాళ్లని చూసి అతనికి సొంత బైకు కావాలన్న తపన మరింత ఎక్కువైంది.

తన తల్లిదండ్రులని అడిగితే వాళ్ళు 'ఈ వచ్చిన డబ్బు నీదే, నీకు ఇష్టం వచ్చినట్లు వాడుకోవచ్చు. కానీ చూడు, నీకు ఇంకా చాలా అవసరాలు ఉన్నాయి, మరిన్ని అవసరాలు భవిష్యత్తులో ఎదురవుతాయి కూడా..అందుకని వీటిని వాడకుండా పొదుపు చేసుకుంటే నయమేమో, ఆలోచించు" అన్నారు. కానీ రమేష్ పట్టు విడవలేదు. ఎంతో బ్రతిమలాడి వాళ్లను ఒప్పించాడు. తనకొచ్చిన బహుమతి డబ్బులతో ఒక రేసింగ్ బైకును కొన్నాడు. ఆ బైక్ మీద ఎంతో వేగంగా వెళ్లటం మొదలుపెట్టాడు.

మీరు చూసే ఉంటారు- అలా ఎంతో మంది ఎన్నో చోట్ల బైక్‌లు నడిపేందుకు పెట్రోలును వాడిఉంటారు. ఎంతో డబ్బు ఖర్చు అవుతూ ఉంటుంది. ఆ బళ్ళకి ప్రతిరోజూ పెట్రోల్ పోయించాలి కదా! మరి ఆ ప్రత్యేకమైన రేసింగ్ బైకుల్లో వాడే పెట్రోల్ కూడా ప్రత్యేకమైనదే- ఎంతో ఖరీదైనది. రమేష్ చిన్న చిన్న దూరాలకు కూడా బైక్ వాడేవాడు మరి!

అలాగ, ఇక రమేష్ ఖర్చు పెరిగిపోయింది. అంతకు ముందు నెలకొకసారి డబ్బులు అడిగి తీసుకునేవాడు, ఇప్పుడు ప్రతిరోజూ వాళ్ల నాన్నని డబ్బులు అడిగే పరిస్థితి వచ్చింది. దానితోబాటు అతని ఆరోగ్యం కూడా, మెల్లగా పాడవ్వటం మొదలయింది. పొట్ట పెరిగింది, కడుపు చుట్టూ క్రొవ్వు పేరుకున్నది, నడుం నొప్పి, భుజాల నొప్పి మొదలైనాయి. మొదట్లో రమేష్‌కి ఇవన్నీ తన బైకు వల్లనే అని తెలియలేదు. అయితే కొంత కాలం పాటు డాక్టర్ల చుట్టూ తిరిగాక, వాళ్ళు అతనికి చెప్పారు- 'ఇవన్నీ జీవనశైలి వల్ల వచ్చే సమస్యలు' అని.


రమేష్‌కి ఏం చెయ్యాలో తోచలేదు. అయితే ఆ సమయంలో వాళ్ల నాన్న ముందుకొచ్చి, తనకు ఒక సైకిలును కొనిపెట్టారు- "రమేష్, సైకిలే కదా అని చిన్నచూపు చూడకు. సైకిలుకు పెట్రోలు అవసరం ఉండదు. సైకిలు త్రొక్కటం వల్ల వ్యాయామం జరుగుతుంది, శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. బైకును అమ్మెయ్యి; దీన్ని వాడి చూడు- అన్నీ సర్దుకుంటాయి"

అన్నారు.

మొదట రమేష్ వాళ్ల నాన్న మాట వినలేదు. అయితే రానురాను పెట్రోల్ ధరలు మరింత పెరిగాయి. రమేష్ కాలేజీ ఫీజులు చెల్లించటానికి కూడా ఇబ్బందిగా ఉండింది. చివరికి అతను తన బైకును అమ్మేశాడు. ఆ వచ్చిన డబ్బులో అధిక భాగాన్ని పొదుపు చేశాడు. అయిష్టంగానే సైకిలును వాడటం మొదలుపెట్టాడు.

ఆశ్చర్యం! ఖర్చులు తగ్గాయి. డబ్బులు చేతిలో మిగిలాయి. రమేష్ ఆరోగ్యం కూడా బాగైంది. తనకి చదువుమీద ధ్యాస కుదిరింది. అన్నీ సర్దుకున్నాక,ఇప్పుడు రమేషే అందరికీ చెబుతున్నాడు- 'బైక్ కన్నా సైకిల్ మేలు కదా' అని!





పెట్రోల్ సలహా

రచన: టి. సాయి హేమాంజలి, 9 వతరగతి, అరవిందా హైస్కూల్, కుంచనపల్లి, గుంటూరు జిల్లా.

హాయ్ ఫ్రెండ్స్! నేనే, మీ అమ్మానాన్నలకు ఎంతో అవసరమైన దానిని. మీక్కూడా నేనెంతో అవసరమే! నేను లేకుండా మీబైకులు,స్కూటర్లు నడవ్వు . నన్ను గుర్తుపట్టారా? ఆ...నేనే పెట్రోల్ని!

నేను అసలు ఎట్లా పుట్టానో తెలుసా, మీకెవరికైనా? సరే, పరవాలేదు-నేనే చెబుతాను- "నేను ఒక 'శిలాజ' ఇంధనాన్ని- అంటే ఏంటో తెలుసా? ఎన్నో కోట్ల సంవత్సరాల క్రితం ఈ భూమి మీద ఉన్న అడవులు అగ్ని పర్వతాల వల్ల, భూకంపాలవల్ల మన భూమిలోతుల్లో కూరుకుపోయి ఉండిపోయాయి. ఎన్నో రాళ్ళు రప్పలు వాటిమీద పడి, అధిక పీడనాన్ని కలిగించాయి. ఇక అక్కడ వాటికి సరిపడ ప్రాణవాయువూ లభించలేదు- అట్లా అవి అన్నీ పాక్షికంగానే కాలాయి- అట్లా శిలాజ ఇంధనాలు నేల లోతుల్లో తయారయ్యాయి.

అట్లా నేను నదుల ఒడ్డుల్లోను, సముద్రం అట్టడుగుల్లోనూ తయారయి ఉండటానికి లక్షల సంవత్సరాలు పట్టింది. అట్లా నేల లోతుల్లో దాక్కొని ఉన్న నన్ను, అష్టకష్టాలూ పడి వెలికి తీసుకువస్తున్నారు మీ మానవులు.

అయితేనేమి, నా నిలవలు తగ్గిపోతున్నాయి! అందుకని నన్ను త్రవ్వి తీసేందుకయ్యే ఖర్చూ రాను రానూ పెరిగిపోతున్నది. ఇప్పుడు నన్ను కొనడానికి కూడా భయపడుతున్నారు మీరు. ఎందుకు అనుకుంటున్నారా ? నా నిలవలు తగ్గినకొద్దీ నా ధరలు అంతగా పెరిగి పోతున్నాయి మరి! ఆగండి- ముందు మీకు ఓ కథ చెబుతాను-

అనగనగా ఓ గ్రామంలో రామయ్య అనే పేద వ్యవసాయదారుడు ఒకడు ఉండేవాడు. అతనికి ఇద్దరు పిల్లలు. అతని తల్లి కూడా వారింట్లోనే ఉండేది. ఈ కుటుంబాన్ని పోషించటానికి సరిపోయేంత సంపాదన లేదు రామయ్యకు. ఎప్పటికప్పుడు, ఏవో అప్పులు సొప్పులు చేసుకొని బ్రతుకు ఈడుస్తున్నారు వాళ్ళు.

ఒక రోజు రామయ్య పొలం పనికి పోయాడు. అకస్మాత్తుగా ఆ పొలపు మూలలనుండి ఓ దేవత వచ్చి రామయ్యకెదురుగా నిలబడి, ఏం కావాలో కోరుకోమంది. "ఒక్కో కోరిక తీర్చినందుకూ ఒక్కో రూపాయి ఇవ్వాలి. కోరిక ఈ ఒక్కరోజుకూ పరిమితం అయి ఉండాలి" అని నియమం విధించింది. రామయ్య ఎంతో సంతోషించాడు. తనకు మంచి బట్టలు, తినడానికి తిండి కావాలని కోరుకున్నాడు. దేవతకు రెండు రూపాయలు ఇచ్చాడు. రామయ్య ఇచ్చిన ఆ రెండు రూపాయల్నీ తీసుకుని రెండు కోరికలూ తీర్చింది దేవత. ఆరోజు రామయ్య ఇంటికి వెళ్ళగానే తన దగ్గరున్న వస్తువులన్నీ చూపించి, ఇంట్లో వాళ్ళకు జరిగిందంతా చెప్పాడు.

ఇట్లా రెండు రోజులు గడిచేటప్పటికి, సంగతి పొరుగింటి సీతయ్య చెవుల్లో పడింది. సీతయ్య, రామయ్యకు మిత్రుడు. అతను రామయ్యను కలిసి, తననూ ఆ దేవతకు పరిచయం చేయమన్నాడు. 'నాదేం పోతుంది?' అని రామయ్య సీతయ్యను

వెంటబెట్టుకెళ్ళి ఆ దేవతకు పరిచయం చేసాడు. ఇద్దరూ కోరికకు ఒక రూపాయి చొప్పున కావలసినన్ని కోరికలు తీర్చుకున్నారు.

అట్లా రాను రాను దేవత వెంట పడే జనాలు ఎక్కువయ్యారు. చివరికి ఆమె రోజూ వెయ్యి మందికి- రెండు వేల మందికి కోరికలు తీర్చవలసి వచ్చింది.

ఇక ఆ దేవత సహించలేక పోయింది. కోరికకు ధరను పెంచేసింది. అయినా రామయ్య, ఇతర జనాలు అందరూ వేరే వాళ్ళ దగ్గర అప్పు తీసుకుని మరీ వచ్చేవాళ్ళు. ప్రతీదీ ఆ రోజే అయిపోగొట్టాలి గదా!

చివరికి ఆ దేవత మనుషులంటే విసిగిపోయింది. ఇక ఇప్పుడు ఎవ్వరికీ కనబడడం లేదు. కోరికలు తీర్చటం ఆపేసింది. ఇప్పుడు రామయ్య గతి నిజంగా ఘోరమే అయ్యింది. తినటానికి తిండి లేదు; అప్పు తీర్చడానికి డబ్బు లేదు. దేవత అన్నీ ఇస్తుందనే నమ్మకంతో పొలాన్ని కూడా గాలికి వదిలేసాడు- పని అలవాటు తప్పి పోయింది.

చూసారా? దురాశా దు:ఖానికి చేటు అంటే ఇదే!

ఇప్పుడు నా విషయంలో కూడా ఇదే జరుగబోతోంది! నన్ను వాడుకొనే వాహనాలు ఎక్కువ అయిపోతున్నాయి. నన్ను దిగుమతి చేసుకొనే దేశాలూ ఎక్కువ అవుతున్నాయి. నన్ను త్రవ్వి తీసేందుకు శ్రమ ఎక్కువవుతున్నది. కనుక నా ధరలూ పెరుగుతున్నాయి. ఇది గనక ఇలాగే కొనసాగితే, నేను శాశ్వతంగా మాయమవ్వటం ఖాయం. అప్పుడు ఇక ఎంత డబ్బు కట్టినా నన్ను కొనడం మీ తరం కాదు!

కాబట్టి నన్ను రక్షించుకోండి! వాహనాల ఉపయోగాన్ని తగ్గించండి. వాటి నుండి వచ్చే కాలుష్యాన్ని నాశనం చేయండి. అప్పుడు నేను మీతో ఎల్లప్పుడూ ఉంటాను. మరి మీరు జాగ్రత్త! మా భూమి తల్లిని కూడా జాగ్రత్తగా చూసుకోండి. అసలే అనేక రోగాలతో మా అమ్మ బాధపడుతోంది. నన్ను వాడుకోండి, కానీ మితి మీరి కాదు! అర్థమైంది కదూ, ఉంటానిక! బై!

గేయ కథ



కండచీమల నాయకుడు-నిద్రమత్తు ఏనుగయ్య

చీమలెందుకు గొప్పవి? ఏనుగు ఎప్పుడు తీసికట్టు అవుతుంది? ఇదిగో, ఈ గేయకథలో ఉంది- చూడండి...
రచన: శ్రీ పి.యస్.నాగరాజు, సంపాదకులు, ప్రజాసాహితి.

చీమెందుకు గొప్పదో-
ఏనుగెప్పుడు తీసికట్టో-
విడమరచే చిట్టి కథ
వింటారా, పిల్లలూ!
చిట్టడవికి ఇటుప్రక్క
కొండవాగు కటుపక్క
ఉందండోయ్ చీమలపుట్ట

ఆ దరినే ఏనుగయ్య కుటుంబం!
ఏనుగయ్య అడుగులకు
నుజ్జునుజ్జు కాకుండా
తమ పుట్టను-తమ పుంతను
కాచుకొనెడి చీమలు
ఏనుగుల బారినుండి
చెట్లనూ కాపాడుతాయి!

వేరునుండి కాండానికి

కాండం నుంచి కొమ్మలకు

కొమ్మలకు, రెమ్మలకు

చీమలు బారులు తీరాయి

ఏనుగుల దారిని మళ్లించాయి!



ఏనుగయ్యకు ఎప్పటినుండో

చీమలంటె చీదర

పాకితే గగుర్పాటు

తొండానికి చీమలను

చేరనీక జాగ్రత్తగ

మసలుతాడు ఏనుగయ్య!

రకరకాలు ఖాద్యాలు నోటకరిచి

గింజలను, పుప్పొళ్ళను సేకరించి

ఎక్కడెక్కడో తిరిగి తిరిగి

పుట్టలో గదుల్లో పదిల పరుచు

ముందు చూపు చీమలది!

క్షణం తీరిక లేక

శ్రమిస్తోన్న చీమలను

ఏనుగయ్య చూసాడు

హేళనగా నవ్వాడు

చిరాకుగా చీదాడు

మధ్యాహ్నం చెట్టునీడ

చల్లదనం ఈయగా

పుట్టప్రక్క ఎడంగా

గరికమీద మేను వాల్చి కులాసాగ-

చీమల నాయకుణ్ణి పిలిచాడు

ఏనుగయ్య చిన్నచూపు చూసాడు

రెక్కలు విరుచుకు క్షణక్షణం

ఎందుకింత యాతనంటు
ఏవగింపు చూపాడు!
తనలాగ ఒళ్ళు పెంచితే
చింతలే ఉండవంటు
అల్పమైన చీమలని
అలుసు చేసి వాగాడు!
ఎగతాళి చేసాడు
హేళనగా నవ్వాడు
చీమలన్ని ఎగిరి పడగ
పక్క బెదురు ప్రక్కనుంచి
తొండంతో ఊదాడు!
చీమల బారు చెదిరిపోయింది
కూడిన కూడు జారిపోయింది
చీమలన్నీ కుమిలాయి
నాయకుడొచ్చి ఓదార్చాడు
కష్టం చేసే కండ చీమలను
ఒక్కటి చేసి కూడదీశాడు
దండు కట్టి ఎదురు నిలిచి
హెచ్చరికలు చేసాడు!
నిద్రమత్తున మదమెక్కి
ఏనుగయ్య నవ్వాడు
ఎకసెక్కం చేశాడు
చిన్ని చీమల గొప్పదనం తెలియక
హీనంగా ఇకిలించాడు!
కండ చీమ నాయకుడు
గొంతు పెంచిచెప్పాడు-
"పడుకున్న ఏనుగుకన్న
పనిచేసే చీమే మిన్న"
పని సంస్కృతి సమిష్టితత్వం
తను చీమల బలమంటూ
ఏనుగయ్య తొండానికి
చీమకుట్టు చాలంది!
మంటలొచ్చి భగ్గుమంటే
చీమలమంతా గుండ్రంగా
వుండ చుట్టుకొని దొర్లుకుంటూ
గండాన్ని గడుస్తామని

అందరి కోసం కొంతమందిమి
ఆత్మత్యాగం తమ సొత్తని
చీమల జీవన సంస్కృతిలో
ఔన్నత్యాన్ని చాటిచెప్పాడు
నీరు పొంగి పొరలుతుంటే
పొరలు పొరలుగా చీమలమంతా
నీటి అలలపై తేలుకొంటూ
ఒడ్డుకు చేరే తెలివి తమదని
అందరికోసం కొంతమందిమి
ఆత్మత్యాగం తమ సొత్తని
చీమల జీవనశైలిని తెలపగ
ఏనుగయ్య కొండంతగా
అవాక్కయ్యాడు! బిక్కపోయాడు!
నీఅంత నీవని
నా అంత నేనని
గౌరవాన్ని ఇచ్చినపుడె
గౌరవం వస్తుందని
హితవు పలుక చూచాడు

కండ చీమ నాయకుడు
పుట్ట లోని చీమలన్ని
చిటికలోన కూడబలికి
ఏనుగంతగా గుమికూడె
చీమల ఏనుగు రూపొందె!



సంఘటిత శక్తిరూపాన్ని
చీమల్లో చూసినంత
ఏనుగయ్య చలించాడు
తన తప్పును గుర్తించాడు
లోలోపల గుండెజారి
బిక్కు బిక్కుమన్నాడు!

పుట్టముందు చెరుకు గడను



బహుమతిగా పెట్టాడు

చీమలతో నేస్తాన్ని

చిరునవ్వుతో కలిపాడు!

చీమలన్ని గొంతుకలిపి

శ్రమగీతం పాడారు

ఏనుగయ్య పిల్లలతో

చిందులేసి ఆడారు

తేనె తీపి స్నేహాన్ని

విందులుగా చేసుకొని

ముచ్చటగా మురిసారు

ఒద్దికగా మెలిగారు!

ఎక్కువ తక్కువ తేడాలొదిలి

నేలన అందరు ఒక్కటని

నినాదాలతో మారు మ్రోగి

కొత్తబాటలే వేశారు

ఒక్క పాటనే పాడారు!

నవ్వు!

ఏదో ఓ నొప్పి!

టీచర్: రవీ, 2364ను 9తో భాగించి 5476ను కలిపితే ఏమొస్తుంది?

రవి: తలనొప్పి...!

వాచి!?

వేణు: ప్రమాదపు దెబ్బకి నా చేయి వాచిపోయింది.

వెంగళప్ప: ఆ వాచీ ఏ కంపెనీది?



మోసం చేయాలనుకోకు!

ఇలాంటి కథల్ని ఎన్నిసార్లు చదివినా తనివి తీరదు పిల్లలకు. అందునా గొప్పవారి కథనంతో, సీమ మాండలికంలో వెలువడితే, మరింకేమి? ఇదిగో చదవండి,...

సేకరణ, కథనం, సౌజన్యం: డా.ఎం.హరికిషన్, జనవిజ్ఞానవేదిక, కర్నూలు

ఒకూర్లో ఒక పేదోడు, ఒక ధనవంతుడు వుండేవాళ్ళు, పేదోడు చానా మంచోడు అంతేగాక చానా తెలివైనోడు. ధనవంతుడు చానా చెడ్డోడు అంతేగాక పక్కనోళ్ళు హాయిగా వుంటే అస్సలు ఓర్చుకొనేటోడు కాదు. ఇద్దరివీ పక్కపక్క ఇండ్లే.

ధనవంతునికి పేదోడంటే చానా కోపం, ఎందుకంటే పేదోడు వున్నదాంట్లో తాను తింటా, నలుగురికీ పెడతా, ఎప్పుడూ అందరితో గలగలా మాట్లాడుతా, కిలకిలమని నవ్వుతా సంబరంగా వుండేటోడు. ధనవంతుడు అట్లా కాదు. ఎప్పుడు చూసినా ఎవన్ని ఎట్లా ముంచాల్నా...ఎట్లా మరింత

సంపాదించాల్నా అని ఆలోచిస్తా చిరాకుగా వుండేటోడు. రాత్రి పండుకున్నా వానికి నిద్ర గూడా వచ్చేది కాదు. వాడు పక్కింట్లో వున్న పేదోన్ని చూసి "వీనికి తినడానికి పైసా గూడా లేకున్నా పట్టుపరుపుల మీద పన్నుకునే నాకన్నా సంతోషంగా వుంటాడే" అని కోపం వచ్చేది. ఎట్లాగైనా సరే వీన్ని బాధపెట్టి కళ్ళులో నీళ్ళు సూడాలి' అనుకునేటోడు.

పేదోని దగ్గర ఒక మంచి బరగొడ్డు వుంది. రోజూ దాని పాలు పిండుకోని కావలసినంత గాసి తోడు పెట్టుకునేటోడు. తినడానికి ఏమీ లేకపోతే ఆ పెరుగునే మజ్జిగ చేసుకోని, ఇంత వుప్పేసుకోని కడుపు నిండా కమ్మగా తాగి కళ్ళు మూసుకోని హాయిగా నిదురపోయేటోడు. ధనవంతుని కన్ను ఆ బరగొడ్డు మీద పడింది. ఒకరోజు ఎవరూ లేనిది చూసి మట్టసంగా ఆ బరగొడ్డును తీసుకోని పోయి చంపేసినాడు.

పేదోడు పొద్దున్నే లేసి చూస్తే ఇంకేముంది. బరగొడ్డు ఎక్కడా కనబళ్ళేదు. బైటికి ఎక్కడికయినా పోయిందేమోనని వీధి వీధి వెదికినాడు. ఎక్కడా కనబళ్ళేదు. ఆఖరికి ధనవంతుని ఇంటి వెనకాల దిబ్బలో దాని చర్మం కనబడింది. వాడు ఒక్కమాట కూడా అనకుండా ఆ చర్మాన్ని తీసుకోని ఇంటికి వచ్చినాడు. దాన్ని శుభ్రంగా కడిగి పక్కవూరిలో ఎంతకో ఒకంతకు అమ్ముదామని తోళ్ళ వ్యాపారి దగ్గరికి బైలుదేరినాడు.



కానీ అప్పటికీ సాయంకాలమైంది. వూరు దాటి కొంచం దూరం పోయినాడో లేదో చీకటి పడింది. చీకట్లో పోవడానికి భయపడి ఎందుకయినా మంచిదని ఒక పెద్ద చెట్టు ఎక్కి

పైన కొమ్మల మధ్య కనబడ కుండా కూర్చున్నాడు. కాసేపటికి కొంతమంది దొంగలు అక్కడికి వచ్చినారు. చెట్టు కింద కూచోని ఎక్కడెక్కడి నుంచో దోచుకొని వచ్చిన సొమ్మంతా ముందు కుప్పేసుకుని పంచుకోసాగినారు. ఇదంతా పై నుంచి చూస్తోన్న పేదోడు "ఓ" అని గట్టిగా అరుస్తా "రేయ్...ఎవర్రా నా చెట్టు కిందకే వచ్చినారు. మిమ్మల్ని నలుచుకోని తింటా" అంటూ చేతిలోని బరగొడ్డు చర్మం దభీమని వాళ్ళ మధ్య పడేసినాడు. దాన్ని చూస్తానే వాళ్ళు అదిరిపడి "ఓరినాయనోయ్... పైన ఏ రాక్షసుడో కూర్చోనున్నట్లు న్నాడు. బరగొడ్డును తిని చర్మం పాడేసినాడు. కిందికి గనుక వచ్చినాడంటే మన పని అంతే" అని భయపడి ఎక్కడివక్కడ వదిలేసి తలా ఒక దిక్కు చించుకోని పారిపోయినారు. వాళ్ళట్లా ఉరకడం ఆలస్యం పేదోడు టకటకటక చెట్టు దిగి అక్కడున్న బంగారమంతా గబగబగబ మూట గట్టుకోని చక్కగా ఇంటికి చెక్కేసినాడు.

ధనవంతుడు పొద్దున్నే లేసి చూస్తే ఇంకేముంది.. పేదోడు ఇంతకు ముందు కన్నా సంబంరంగా ఇంటి ముందు కూర్చోని పంచభక్ష పరమాన్నాలు తింటా కనబన్నాడు. అది చూసి ధనవంతుడు "ఏమిరా...అంత సంబరంగా కులుకుతా వున్నావు ఏమైంది" అన్నాడు. దానికి వాడు కిలకిలకిలమని నవ్వుతా "ఏం లేదనా... ఈ మధ్యనే రోగాలొచ్చి చుట్టు పక్కల వూళ్ళలో పశువులన్నీ ఒక్కటి గూడా మిగలకుండా చచ్చిపోయినాయంట.



దాంతో పట్నంలో పశువుల చర్మాలకు ఎక్కడ లేని గిరాకీ వచ్చింది. నాకు కావాలంటే నాకు

కావాలంటూ ఎగబడి నా బరగొడ్డు చర్మాన్ని వేయి బంగారు వరహాలిచ్చి కొనుక్కుపోయినారు. అబ్బ... నాకు ఇంకొన్ని పశువులు గనుక వున్నింటే దెబ్బకు పెద్ద జమీందారుని అయిపోయేటోన్ని" అన్నాడు.

ఆ మాటలింటానే ధనవంతునికి ఎక్కడ లేని ఆశా పుట్టుకొచ్చింది. వాని దగ్గర వంద బరగొడ్లున్నాయి వెంటనే అన్నిటినీ చంపించి చర్మాలన్నీ బండి మీదేసుకోని సంబరంగా పట్నానికి పోయినాడు. పోయి చూస్తే ఇంగేముంది అక్కడ ఒక్కడు గూడా పలకరించేటోడు లేడు. వూకిస్తామన్నా తీసుకునేటోడు లేడు. దాంతో వానికి పేదోడు దెబ్బకు దెబ్బ తీసినాడని అర్థమైంది. కోపంగా బుసలు కొడతా ఇంటికి వచ్చినాడు.

ఒకరోజు ఇంట్లో ఎవరూ లేనిది చూసి పేదోని ఇంటిని మొత్తం తగల బెట్టినాడు. పేదోడు వచ్చి చూసే సరికి ఇంకేముంది మొత్తం బూడిదయిపోయింది. అలా చేసింది ధనవంతుడే అని తెలిసినా వాడు ఒక్కమాటా అనలేదు. గమ్మున ఆ బూడిదనంతా సంచులకెత్తుకోని బండిలో వేసుకోని వూరి బైట ఎక్కడయినా పారేద్దామని బైలుదేరినాడు.



అట్లా పోతా వుంటే దారిలో ఒక వ్యాపారి బండి మీద మూటలేసుకోని ఎదురుగా వచ్చినాడు. వాడు పేదోన్ని చూసి "ఏమున్నాయి ఆ సంచుల్లో" అన్నాడు. పేదోడు నవ్వుతా "రత్నాలు, వజ్రాలు" అన్నాడు. దానికా వ్యాపారి "అలాగా నా మూటల్లో బంగారం వుంది. నువ్వు నాకు రత్నాలు, వజ్రాలు ఇస్తావా...నేను నీకు బంగారం ఇస్తా" అన్నాడు. పేదోడు సరే అన్నాడు. దాంతో ఆ వ్యాపారి "అయితే బండ్లు మార్చుకుందాం

రా" అంటూ తన బండి పేదోనికిచ్చి, పేదోని బండి తాను తీసుకోని పోయినాడు.

తరువాత రోజు పొద్దున్నే ధనవంతుడు లేసి చూస్తే ఇంకేముంది..పేదోడు పట్టుబట్టలు కట్టుకోని వందమంది పనోళ్ళతో కొత్త ఇంటి కోసం పునాదులు తవ్విస్తా కనబన్నాడు. అది చూసి ఆశ్చర్య పడుతూ "ఇదేందిరా..ఇంత పెద్ద ఇంటి కోసం ఇంత మందితో పని చేయిస్తా వున్నావు. అంత డబ్బెక్కడిది" అన్నాడు. దానికి వాడు కిలకిల నవ్వుతా "ఏం లేదనా...పక్కూర్లో ఒక వ్యాపారికి బూడిదతో చానా పని బడిందంట. దాంతో సంచి సంచి బూడిదకు సంచి సంచి బంగారం ఇస్తానని బంగారం మూటలు బండి మీదేసుకోని తిరుగుతూ వున్నాడు" అన్నాడు.

అలాగా అని ఆ ధనవంతుడు వాని బంగళా మొత్తం తగులబెట్టుకొని బూడిదను ఏడు బండ్లకు ఎత్తుకోని పక్కూరికి బైలుదేరినాడు. అడవిలో వ్యాపారస్తుడు బంగారు మూటల్తో పోతా వున్నాడు. వాన్ని చూసి ధనవంతుడు "ఏం వ్యాపారీ...నీ బంగారు మూటల్తో నా బూడిద మూటలు మార్చుకుందామా" అన్నాడు నవ్వుతా... దాంతో వాడు ఇంతకుముందు మోసం చేసింది వీడేననుకోని "దొంగబడవా! సారిసారికి మోసపోవడానికి నేనేమన్నా వెర్రోన్ని అనుకుంటున్నావా" అంటూ పట్టుకోని తన్నినచోట తన్నకుండా మెత్తగా తన్ని పంపించినాడు.

ధనవంతునికి కోపం పెరిగిపోయింది. ఈసారి వీని సంగతి అటో ఇటో తేల్చి పారేయాలనుకున్నాడు. ఆ రోజు రాత్రి బాగా చీకటి పన్నాక, అందరూ పండుకున్నాక చప్పుడు కాకుండా అడుగులో అడుగు వేసుకుంటా పోయి, వాని ముక్కుకు మత్తుమందు చూపి, కాళ్ళూ చేతులూ కట్టేసి, వూరవతల వున్న ఒక పెద్ద బావిలో పాడేసినాడు. కానీ పేదోని అదృష్టం కొద్దీ అందులో నీళ్ళు లేవు. మెత్తని గడ్డి మీద పన్నాడు. మత్తు తగ్గగానే పేదోడు లేచి నోటితో తాళ్ళు ఇప్పుకొన్నాడు. పైకి లేస్తుంటే కాళ్ళకు ఏవో తట్టుకున్నాయి. ఏమబ్బా అని

చూస్తే ఇంకేముంది... ఎప్పుడో ఎవరో దాచిపెట్టిన లంకె బిందెలు కనబన్నాయి. అవన్నీ మూటగట్టుకొని కాపాడండి కాపాడండి... అంటూ గట్టిగా కేకలు పెట్టసాగినాడు. దారిలో పోతా వున్న కొందరు ఆ అరుపులు విని లోపలికి తాడేసి వాన్ని కాపాడినారు.

ధనవంతుడు తరువాత రోజు పొద్దున్నే లేసి చూస్తే ఇంకేముంది... పేదోడు ఇంటి ముందు కూచోని లంకెబిందెల్లోని వరహాలు లెక్కబెడుతా కనబన్నాడు. అది చూసి ఆశ్చర్యపోయిన ధనవంతుడు "ఈ వరహాలు ఎక్కడివిరా" అన్నాడు. దానికి వాడు కిలకిలమని నవ్వుతా "నిన్న ఎవరో నన్ను ఎత్తుకోని పోయి వూరి బైటి బావిలో పాడేసినారు. ఆ బావి అట్లాంటిట్లాంటి మామూలు బావి కాదు. స్వర్గానికి దారి వున్న బావి. నేను లోపల పడగానే చనిపోయిన మా తాత ముత్తాతలంతా వచ్చి స్వర్గానికి తీసుకపోయినారు. పొద్దున తిరిగి వచ్చే ముందు ఇదిగో ఈ లంకెబిందెలు ఇచ్చినారు" అన్నాడు సంబరంగా.



దాంతో ఆ ధనవంతునికి ఆశ పుట్టింది. ఆ రోజు రాత్రి ఎవరికీ చెప్పకుండా పది గోనె సంచులు తీసుకోని పోయి ఎగిరి బావిలో దుంకినాడు. కానీ పాపం...వాని దురదృష్టం కొద్దీ పోయి ఒక పెద్ద బండ మీద పన్నాడు. అంతే...తల పగిలి అక్కడికక్కడే చచ్చిపోయినాడు.

సుశీల: వదినగారూ! ఒక చెంచా కాఫీపొడి, ఒక గ్లాసు పాలు, రెండు చెంచాలు చక్కెర అరువిస్తారా?

లక్ష్మి: మీకు ఆ కొంచెం శ్రమా ఎందుకులెండి. కాఫీ నేనే చేసిస్తాను- తాగి వెళ్దురుగాని...!



ఉపాధ్యాయ లక్షణం

ఎట్లా చెబితే విద్యార్థులకు అర్థమౌతుందో గమనించుకొని, అట్లా చెప్పటం మంచి ఉపాధ్యాయుల లక్షణం. అలాంటి ఓ చక్కని గురువు కథ, ఇదిగో- చదవండి..

రచన: రమాదేవి, స్కూల్ అసిస్టెంట్ జిల్లాప్రజాపరిషత్ సెకండరీ పాఠశాల, తరాలపల్లి, హన్మకొండ, వరంగల్.

విదిషా రాజ్యాన్ని పరిపాలించే జగన్నాథ మహారాజు ప్రజలను కన్నబిడ్డలకంటే మిన్నగా చూసుకునేవాడు. ఆయన పాలనలో రాజ్యం సుభిక్షంగా ఉండేది.


ప్రజలందరూ సంతోషంగా ఉన్నా, రాజు మాత్రం ఎప్పుడూ విచారంగా ఉండేవాడు: కారణం, తన నలుగురు కొడుకులూ చదువు సంధ్యలు లేకుండా తిరగటం. ఒక్కరికీ పొట్ట పొడిస్తే అక్షరం ముక్కరాదు. 'రేపు తనకు వృద్ధాప్యం వచ్చాక, ఇలాంటి అయోగ్యులకు రాజ్యభారం ఎలా అప్పగించేది? ప్రజల గతేంటి?' అని రాజుగారి బాధ. 'వీళ్ళకు ఎవరైనా విద్యాబుద్ధులు నేర్పించగలరా?

వీళ్ళను వివేక వంతులుగా తీర్చిదిద్దలేరా?' అని కనిపించిన ప్రతి పండితుడినీ అడిగేవాడు రాజు. అయినా రాజకుమారుల దుందుడుకుదనం, మంకు పట్టు చూసాక, సరేనని ఏ పండితుడూ ముందుకు రాలేదు. ఎవ్వరూ సాహసించ లేదు.

ఇట్లా చాలా కాలం గడిచాక, 'నేను ప్రయత్నిస్తాను' అని ముందుకొచ్చాడు, విద్యాధరుడు అనే గురువుగారొకరు. 'రాజకుమారులకు విద్యాబుద్ధులు నేర్పి ప్రయోజకులను చేస్తాను' అని వాగ్దానం చేసాడాయన.

ఆ సరికి రాజకుమారులు రోజూ పావురాలు ఎగుర వేస్తూ ఆడుకుంటున్నారు. ప్రతిరోజూ వారికి అదే వ్యాపకం. విద్యాధరుడు వారి వద్దకు వెళ్ళి తనుకూడా పావురాలు ఎగురవేయడం ప్రారంభించాడు. త్వరలోనే వారికంటే బాగా ఎగరవేసి, వారి మన్నన పొందాడాయన. అలా వారితో స్నేహం చేసి వారితో కలిసిపోయాడు. ఒకరోజున ఆయన "మీకు నేనొక పావురాల పోటీ పెడతాను. మీరు సిద్ధమేనా?" అని అడిగారు వాళ్లను.

"ఎట్లాంటి పోటీకైనా సరే, మేము సిద్ధం. చెప్పండి ఏం పోటీ?" అన్నారు రాజకుమారులు ఉత్సాహంగా.



"ఇదిగో తెలుగు భాషలో అక్షరాలు ఇలా ఉంటాయి. ఇది 'అ' ఇది 'ఆ', ఇ, ఈ, ఉ...........ఇదిగో, ఇది 'ఱ'. ఇట్లా ఉన్న మొత్తం అక్షరాలనూ ఒక్కొక్కదాన్నీ ఒక్కో అట్టమీద వ్రాసి పావురాల కాళ్ళకు కట్టి ఎగురవేశాను. ఇప్పుడు మీలో 'క' అక్షరం గల పావురాన్ని తెచ్చి చూపిన వాళ్లకు ఓ చక్కని బహుమతినిస్తాను" అన్నాడు విద్యాధరుడు.

ఇంకేముంది? రాకుమారులు పావురాల వేటలో పడ్డారు- అందరూ ఉత్సాహంగా 'క'పావురాన్ని వెతకడానికి బయలుదేరారు. కనబడ్డ ప్రతి పావురాన్నీ పట్టుకొని దానికి కట్టి వున్న అక్షరాన్ని పరిశీలించటం మొదలు పెట్టారు. అట్లా త్వరలోనే ఏ అక్షరం ఏమిటో, దాన్ని ఎలా చదువుతారో తెలుసుకున్నారు.


ఇంక ఆ తర్వాత ఒక్కొక్క రోజునా గురువుగారు వాళ్ళకు ఒక్కోరకం పోటీ పెట్టారు. మొదట అక్షరాలు, ఆ తరువాత పదాలు, వాక్యాలు, వ్యాకరణం, నీతిసూక్తులు....ఇట్లా అన్నీ అందించారు వాళ్లకు. రాజకుమారుల్లో నేర్చుకోవాలనే ఉత్సాహం కలిగింది.


ఇక ఆపైన విద్యాధరుడి పని సులభమైంది. క్రమంగా అందరూ మంచి విద్యార్థులైపోయారు. సకలశాస్త్రాలు, వినయ విధేయతలు, మర్యాద-మన్ననలు నేర్చుకొని గొప్ప రాజనీతిజ్ఞులయ్యారు. ✷

చమక్కు!

టీచర్ : పిడుగూ! భూమి ఎట్లా వుంటుంది!?

పిడుగు = ఇవాళ్టి క్లాస్ కి నాకు వచ్చిన మార్కులు లాగా వుంటుంది! మేడమ్!!





నీళ్ళతో వెలిగే ప్రమిదలు

రచన:S.శంకరశివరావు, ఉపాధ్యాయుడు, ఇంద్రజాలికుడు, బద్దలాపురం, కనగానపల్లి, అనంతపురం జిల్లా.

శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించు-కోవడానికి తమ వాహనాలలో ఎంతో మంది వెళుతుంటారు. ఘాటు రోడ్డు ఎక్కే ముందు పెద్ద వేప చెట్టు వస్తుంది. వేప చెట్టు పక్కనే కొండమీదినుంచి సన్నని నీళ్ళ పాయ ఎప్పుడూ ప్రవహిస్తూ ఉంటుంది. అక్కడే "కనుమ గంగమ్మ" పేరుతో కొండ చరియ దిగువన ఓ విగ్రహం వెలిసింది. గంగమ్మ విగ్రహానికి నిత్యం పూజలు చేస్తుంటాడు ఓ సాధువు, తన సహచర బృందంతో. శ్రీశైలం వచ్చే పోయే వాహనాల వాళ్ళు ఇంజన్ వేడిని తగ్గించు కోవడానికి కొంత సేపు అక్కడ ఆపి విశ్రాంతి తీసుకుని వెళ్తుంటారు.

హారతి పళ్ళెంలో పసుపు-కుంకుమ తెచ్చి, వాహనాల స్టీరింగ్ మీద బొట్టు పెట్టి యాత్రికులతో మాటామంతి కలుపుతాడు

సాధువు.

ఆ రోజున కొత్తగా తెచ్చిన "ఇన్నోవా" వాహనం ఒకటి వచ్చి ఆగింది అక్కడ. భారీకాయం గల స్త్రీలు, పురుషులు దిగారు కారులోంచి. వారి ఆభరణాలను, దుస్తులను చూస్తే తెలుస్తున్నది- వాళ్ళు మంచి ధనవంతులు అని. కారు దిగగానే వాళ్ళు వెళ్ళి వేపచెట్టు కింద ఉన్న రాతికట్ట మీద కూర్చున్నారు.

సాధువు మాటలు కలిపాడు వాళ్లతో- "ఏ ఊరు బాబూ, మనది?"


"హైద్రాబాద్!" జవాబిచ్చాడు పెద్దాయన.

"చాలా దూరం నుండి వస్తున్నారే?" మళ్ళీ పలుకరించాడు సాధువు.

"అవును!" బదులిచ్చాడు పెద్దాయన.

"ఇక్కడ ఆగారు మీరు- ఇక నుండి అంతా శుభమే జరుగుతుంది. ఈ గంగమ్మ తల్లి చల్లని చూపులు మీ మీద పడ్డాయి. ఇక మీరు పట్టిందల్లా బంగారమే అవుతుంది" అన్నాడు సాధువు. "అమ్మవారి హారతి తీసుకొని వెళుదురు గాని రండి!" అని వాళ్ళను పిలుస్తూ.

అందరూ సాధువు వెంట నాలుగడుగులు వేసి గంగమ్మ తల్లి ముందు నిలబడ్డారు. ఆ తల్లి ముందు మట్టితో చేసిన కొత్త ప్రమిద ఉంది. దానిలో "వత్తిని" వేసాడు సాధువు. ఆపైన చెలమలోంచి నీళ్ళు తెచ్చి ప్రమిదలో పోసాడు.



"ఏంది స్వామీ! ప్రమిదలో నీళ్ళు పోశారు? నూనెకాని, నెయ్యికాని పోయాలి కదా? నీళ్లతో ప్రమిదలెలా వెలుగుతాయి?" అడిగాడు ఖద్దరు చొక్కాలోని పెద్దాయన, నవ్వుతూ.

"గంగమ్మ తల్లి మహిమ కలది నాయనా.

ఈలాంటి మహిమను అందరికీ చూపించదు గంగమ్మ!" జవాబిచ్చాడు సాధువు- "గంగాధర్! నీ జేబులో ఉన్న అగ్గిపెట్టెతో ఈ ప్రమిదను వెలిగించు!" అని జోడిస్తూ.

కారు యజమాని గంగాధర్ నివ్వెరపోయాడు.

"స్వామీ! నాపేరు తమరికి ఎలా తెలిసింది? నా జేబులో ఎక్కడో ఉన్న అగ్గిపెట్టె గురించి ఎలా కనుక్కున్నారు తమరు?" నేరుగా ప్రశ్నించాడు ఆశ్చర్యాన్ని ఆపుకోకుండా.

"నాదంటూ ఏమీ లేదు- అమ్మ నా చేత పలికిస్తుంది నాయనా!" అన్నాడు సాధువు. అందరూ ఆశ్చర్యంగా చూస్తూండిపోయారు. "వెలిగించు, దీపం!" అనగానే భక్తి భావంతో దీపం వెలిగించాడు గంగాధర్.

నూనె బదులు నీళ్ళు పోసిన ప్రమిద దివ్యకాంతిలా వెలుగుతోంది..

"ఇక గంగమ్మ తల్లి నీడ నీమీద పడింది! నీవు మాత్రం అమ్మకు నీడగా ఉండాలి!పోయిరా" అన్నాడు సాధువు.

"అలాగే స్వామీ! నా వంతుగా ఏం చేయాలో ఆజ్ఞాపించండి- చేస్తాను" బదులిచ్చాడు గంగాద్రి.

"అమ్మవారికి ఆభరణాలంటే ప్రీతి. అందుకు నీవద్ద వున్న బంగారం ఇచ్చావంటే అమ్మవారికి ముక్కు పుడక, మంగళ సూత్రాలు చేయిస్తాను" అన్నాడు సాధువు. "సంశయించకండి, అనుమానించకుండా ఏది ఇవ్వబుద్ధయితే అదే ఇవ్వండి. సంశయిస్తే అమ్మకు కోపం వస్తుంది" చెప్పాడు సాధువు.

సాధువు చెప్పిన మాటలకు భయమేసింది గంగాధర్ భార్యకు. "ఏమండీ! ఎలాగూ వచ్చి ఆగాం- మీ చేతిలో ఉన్న "బ్రేస్‌లెట్" ఇవ్వండి! అమ్మవారికి!" అంది గంగాధర్ భార్య అన్నపూర్ణ, భయంతోటీ, భక్తితోటీ. "అవునవును-అది కరెక్ట్" అన్నారు అందరూ. అయిష్టంగానే పదితులాలున్న బంగారు బ్రేస్‌లెట్‌ని సాధువుకు ఇచ్చేసి అక్కడ నుండి కదిలారు గంగాధర్ అండ్ ఫ్యామిలి.

వాళ్ళు అటు వెళ్ళాక, ఆ బంగారంతో అడవిలోకెళ్ళి, పది నిముషాల తరువాత తిరిగి వచ్చాడు సాధువు. వస్తూ వస్తూ తనతో పాటు

ఓ గుడ్డసంచి తీసుకు వచ్చాడు. అందులో ఏదో వస్తువు వుంది. సాధువు ఇప్పుడు చాలా హుషారుగా ఉన్నాడు. గంగమ్మ ముందు కూర్చుని 'ఎవరు వస్తారా!'అని ఎదురు చూడటం మొదలు పెట్టాడతను.

అంతలోనే సాధువు పంట పండిస్తూ వచ్చాయి- రెండు నల్లని బొలెరో వాహనాలు. రెండూ వేపచెట్టు కింద ఆగాయి. బిలబిలమంటూ వాటిలోంచి దిగారు పిల్లలూ-పెద్దలు. అందరూ చెట్టుకింద ఉన్న అరుగు మీద కూర్చుని తాము తెచ్చుకున్న ఫలహారాలు తిన్నారు. వాళ్లలో ఒకావిడ మటుకు ఏమీ తినకుండా పడుకుని ఉన్నది. ఆమెనే నిశితంగా గమనించాడు సాధువు.

అటుపైన ఆ బృందంలోని వారితో మాటలు కలిపాడు- "నాయనా! అమ్మాయికి ఏమైంది? ఫలహారం తినకుండా పడుకుంది!" అడిగాడు.

"ఆరోగ్యం సరిగాలేదు స్వామీ!" బదులిచ్చింది అమ్మాయి తల్లి లలితాబాయి.

"ఆ అమ్మాయిని ఇక్కడికి తీసుకురండి! గంగమ్మతల్లి 'బండారు' ఇస్తాను!" అన్నాడు సాధువు.

ఎవరూ మాట్లాడలేదు.

"అమ్మాయికి ఎవరో చేతబడి చేసారు. అందుకే ఏనుగులా వున్న అమ్మాయి -పీనుగులా అయ్యింది!" చెప్పాడు సాధువు.

అంతే, జీపుల్లోవచ్చిన పెద్దవాళ్లందరూ ఒక్క ఉదుటున లేచారు- "నిజం స్వామీ! అమ్మాయి చాలా బొద్దుగా ఉండేది. ఇప్పుడు ఇలా అయ్యింది" అన్నాడు అమ్మాయి తండ్రి ఆనంద్‌బాబు. "ఇది మాత్రం కరెక్టుగా చెప్పావు స్వామీ!" వంతపలికాడు అమ్మాయి బాబాయి 'వినోద్‌బాబు'.

అందరూ ఆ అమ్మాయిని తీసుకువచ్చి గంగమ్మ ముందు కూర్చోబెట్టారు. ప్రమిదలో నీళ్ళు పోసాడు సాధువు. ఆనంద్‌బాబు, వినోద్‌బాబు ఒకరి మొఖం ఒకరు చూసుకున్నారు అర్థంకాక.

అంతలో అగ్గిపెట్టె తీసి దీపాన్ని వెలిగించాడు సాధువు. నీళ్ళతో దీపం వెలుగుతోంది.

దాంతో అన్నదమ్ములిద్దరికీ గురి కుదిరింది. "సాధువు చెప్పేదంతా నిజమే" అనిపించిందిప్పుడు వాళ్లకు. లలితాబాయి, ఆనంద్‌బాబులు సాధువు కాళ్ళకు మొక్కుకున్నారు. "స్వామీ! నీవే మాకు దిక్కు. ఈ అమ్మాయికి పట్టిన పీడ విరగడ చెయ్యి!" అర్థించారు భార్యభర్తలిద్దరు.



"సరే, నేను చెప్పినట్లు చెయ్యండి" పలికాడు సాధువు. సరే అంటు తలూపారు అందరూ.

గంగమ్మ ముందు ముగ్గుపోశారు. మధ్యలో అమ్మాయిని కూర్చోబెట్టారు. మంత్రాలు చదవడం ప్రారంభించాడు సాధువు. సంచిలో నుండి పీచు వలచని టెంకాయ తీసాడు. "ఓం క్రీం భీం ఫట్" అని మంత్రాలు వల్లిస్తూ టెంకాయ మీద నీళ్ళు చల్లాడు సాధువు.

అంతే- "ఫట్" మని శబ్దం చేస్తూ బాంబులా పేలిపోయింది టెంకాయ.

"చూశారా! పిశాచి వదిలి పోయింది. వెనుకకు తిరిగి చూడకుండా వెళ్ళండి" అన్నాడు సాధువు.

"మీ రుణం ఎలా తీర్చుకోము స్వామీ!" అడిగారు లలితబాయి ఆనంద్‌బాబు.

"అమ్మాయి పెట్టుకున్న నగలతో అమ్మవారిని అలంకరించి వెళ్ళండి. మీకు ఇక ఏ ఎదురూ ఉండదు" అన్నాడు సాధువు.

భక్తిభావంతో పరవశించిపోయారు వాళ్ళు. అమ్మాయి నగలను ఒలిచి గంగమ్మతల్లిని అలంకరించబోయారు- అంతలోనే ఘాట్ రోడ్డులో గస్తీ తురుగుతున్న S.I ఉత్తం రాథోడ్ జీపు అక్కడ ఆగింది. జీపులోంచి దిగిన S.I. ఆ బొలెరో వాహనాల గుంపును, సాధువును చూసి "ఏం జరుగుతోంది ఇక్కడ?" అని గద్దించి అడిగాడు.

నీళ్ళు నమిలాడు సాధువు. S.I పరిసరాలను గమనించి "క్షుద్రపూజ చేయించారా?" అని అడిగాడు ఆనంద్‌బాబును.

"అబ్బే! అలాంటిదేమీ లేదు సార్!" అంటూ కథ మొత్తం చెప్పాడు వినోద్‌బాబు.

"ముందు మీ నగలన్నీ వెనక్కి తీసుకోండి! తీసుకోండమ్మా!!" అంటూ చెప్పుకొచ్చాడు S.I- "మీలాంటి వాళ్లను ఎందరినో మోసం చేసి వుంటాడు వీడు. వీడు చేసే మ్యాజిక్కులను నిజమని నమ్మారు మీరు. వీడు మిమ్మల్ని పిచ్చోళ్ళు చేసాడు. మీ నగల్ని మీరు తీసుకొని వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళండి-పోండి!" అన్నారు S.I గారు- "జీపు ఎక్కరా! స్టేషన్‌కి తీసుకెళ్ళి కుమ్మేస్తే నిజం కక్కుతావు!" అని సాధువునెక్కించి తన జీపును దౌడు తీయిస్తూ.

ఘాట్‌రోడ్డు దాటిన తరువాత 'ధాబా హోటల్' దగ్గర టీ త్రాగడానికి జీపు ఆపారు S.I రాథోడ్ గారు. అక్కడే టీ తాగుతున్న గంగాధర్ అండ్ ఫ్యామిలీ S.I గారి వెనక నక్కి కూర్చొని ఉన్న సాధువును చూసి గుసగుసలు పోయారు. గంగాధర్ S.I ని సమీపించి "నమస్తే సార్! నాపేరు గంగాధర్. మాది హైదరాబాదు, శ్రీశైలం వెళుతున్నాము.." అని పరిచయం చేసుకున్నాడు.

"ఏమిటి విషయం?" అడిగారు S.I గారు.

"ఈ సాధువు.." అంటూ మధ్యలోనే ఆపేశాడు గంగాధర్.

"ఓహో! వీడా?! వీడు దారిన పోయే వాళ్ళను మాయలు, మంత్రాలు అంటూ మ్యాజిక్‌లు చేసి మోసం చేస్తుంటేనూ, నాలుగు తగిలిద్దామని తీసుకెళుతున్నాను. ఏమి? మిమ్మల్నీ వీడు బురిడీ కొట్టించారా? ఏమైనా బంగారం సమర్పించుకున్నారా వీడికి?" అడిగాడు ఉత్తం రాథోడ్, కరకుగా.

"క్షమించండి సార్! ఇతని చేతిలో పదితులాల బ్రేస్‌లెట్ పెట్టాను" అంటూ వినయంగా నిలబడ్డాడు గంగాధర్.

"అదీ సంగతి! ఎలా బోల్తాపడ్డావో చెప్పు!" అడిగాడు S.I.

"నాపేరు పెట్టి పిలిచాడు సార్!"

"అదేం పెద్ద పజిల్ కాదే!? నీ కారు వెనుక అద్దంపైన 'గంగాధర్&సన్స్' అని రాసివుందిగా? చదివాడు కాబోలు!" అన్నాడు S.I.

"మరి నా జేబులో ఉన్న అగ్గిపెట్టెను ఎలా కనిపెట్టగలిగాడు సార్?!"

"నీ నోట్లోంచి సిగరెట్లు తాగిన కంపు ఇప్పటికీ వస్తోంది. అది చాలు, నీ దగ్గర అగ్గిపెట్టె ఉన్నదని గ్రహించడానికి!" బదులిచ్చాడు S.I.

"నీళ్ళతో దీపం వెలిగించాడే, అది మహాత్యం కాదంటారా?" ఎదురు ప్రశ్నించాడు గంగాధర్.

"అదేనోయ్, మీ అజ్ఞానం- వీళ్ళ పెట్టుబడీనీ! ముందుగా కాటన్ వత్తులు కొన్నింటిని పాలలో మళ్ళీ మళ్ళీ నాన బెట్టి ఆరబెట్టాలి. అలాగ ఐదుమార్లు చేసి భద్రపరచుకోవాలి. అలా చేసి పెట్టుకున్న వత్తిని అవసరం అయినప్పుడు వెలిగిస్తే , నీళ్ళలో వేసినా సరే- కొంతసేపు వెలుగుతుంది. పాలలో వున్న కొవ్వు పదార్థాన్ని వత్తి పీల్చుకుంటుందిగదా, అందువల్ల అది వెలగగలదన్నమాట! అది సైన్సే! మహత్యం కాదు!" వివరించాడు S.I ఉత్తం రాథోడ్.

"సార్! పీచు వలవని టెంకాయ బాంబులా పగిలి పోతుందంట కదా? హోటల్‌కు వచ్చిన యాత్రికులు మాట్లాడుకుంటుంటే విన్నాను- అది మహత్యం కాదా?" అడిగాడు టీ కొట్టు నడిపే నాణుసింగ్.


"చూడు, సింగ్‌భాయ్! పీచు వలవని టెంకాయను తీసుకోవాలి. సున్నపు బట్టీ నుండి తెచ్చిన ఊరబొయ్యని కొత్త సున్నం ఉంటుందే, దానిలో ఈ కొబ్బరికాయని వారం రోజులు నానబెట్టి, ఆ తరువాత ఆరబెట్టి, భద్రంగా దాచుకోవాలి. అవసరమయినప్పుడు మామూలు నీళ్ళు తీసుకుని, మంత్రించినట్లు నటించి నీళ్ళు చల్లాలి. అప్పుడు అది బాంబులా శబ్దం చేస్తూ పగిలిపోతుంది. టెంకాయను సున్నంలో ఊరబెట్టడం వలన అది పొడి సున్నాన్ని గ్రహించి ఉంటుంది. ఆ పొడి సున్నం మీద చల్లని నీళ్ళు పడగానే రసాయనిక చర్య జరిగి, టెంకాయ పగిలిపోతుంది. -ఇది కూడా సైన్సే" చెప్పాడు

ఉత్తం రాథోడ్.

"సార్! ఇంకొక అనుమానం-" అడిగాడు టీకొట్టు నాణుసింగ్, S.I తో వినయంగా- "ఇవన్నీ మీకెలా తెలుసు, సార్?" అడిగాడు.

"జనవిజ్ఞాన వేదిక కార్యక్రమాలను కాలేజీలలో ప్రదర్శిస్తున్నప్పుడు అతిథిగా నన్ను ఆహ్వానిస్తారు. అప్పుడు చూశాను ఇవన్నీను" అన్నాడు S.I టీ గ్లాస్ ఖాళీ చేస్తూ. "రేయ్! ఆ "బ్రేస్‌లెట్" ఎక్కడ దాచావురా?" అనగానే బొడ్డులో నుండి బ్రేస్‌లెట్ తీసి ఇచ్చాడు దొంగ సాధువు.

"మూఢనమ్మకాలు మానుకుని, మీ దానగుణాన్ని పేదల మీద, అనాథల మీద చూపండి -కాస్త పుణ్యం దక్కుతుంది" అంటూ రయ్యిన జీపును దౌడు తీయించాడు ఉత్తం రాథోడ్, దొంగ సాధువుని వెంట బెట్టుకొని.



తల్లి (కొడుకుతో): ఒరేయ్ ఈ గాజుగ్లాసును విరక్కొట్టింది నువ్వేనా?

కొడుకు: "లేదే అమ్మా! నా చేతిలోంచి జారిక్రిందపడి దానంతట అదే విరిగిపోయింది...!

నవ్వు!



టీ కప్పు ఆత్మకథ

"భగవంతుడు మనకు కష్టాలను ఇస్తుండేది మనం మరింత బలంగా తయారయ్యేందుకే. అందుకని అన్నికష్టాలనూ ఎదుర్కొంటూ ధైర్యంగా ముందుకు సాగిపోవాలి" అంటూ 'చిన్ని' అనువదించి పంపిన ఈ కథ చదవండి. ఎలా ఉందో చెప్పండి... స్వేచ్ఛానువాదం: చిన్ని, సాఫ్టువేరు ఉద్యోగిని, హైదరాబాదు.

రంగాపురంలో నివసించే చిన్నికి అందమైన టీ కప్పులు సేకరించడం ఒక హాబి. అట్లా సరదాగా ఒకరోజున ఓ అందమైన టీ కప్పుని చేతిలోకి తీసుకుని, ముచ్చటగా దాన్ని నిమురుతూ "అబ్బ ఎంతబాగుందో ఇది! పుడితే ఈ కప్పులా అందంగా పుట్టాలి" అన్నది.

"అవునా? నిజంగా నేను అంత నచ్చానా?" అన్నది కప్పు.

అకస్మాత్తుగా అది అట్లా మాట్లాడే సరికి చిన్ని ఉలిక్కిపడింది. అటుపైన దాన్ని ప్రేమగా చూస్తూ "అవునోయ్, చాలా బాగున్నావు నువ్వు" అన్నది.

టీ కప్పు తన కథని చెప్పుకొచ్చింది- "నేను ఇట్లా ఎందుకున్నానో అర్థం కాదు మీకు- ఒకప్పుడు

నేను ఎర్ర ముద్దలా, బంక మట్టిలా వుండేదాన్ని. ఒకసారి నా యజమాని నన్ను నీళ్ళతో కలిపి, బాగా తొక్కి, చక్రం పైన రౌండ్లు రౌండ్లుగా చాలా సార్లు తిప్పాడు. 'నాకు కళ్ళు తిరుగుతున్నాయి..ఆపు! నన్ను ఒంటరిగా వదిలేయ్' అని చాలా గట్టిగా అరిచాను. ఎంత అరిచినా మా యజమాని మటుకు "అప్పుడే వదిలేయలేను" అని అడ్డంగా తలాడించాడు.

ఆ తర్వాత అతను నన్ను తీసుకెళ్ళి ఒక కొలిమిలో వేసాడు. ఇంతకు ముందెన్నడూ అంతటి వేడిని ఎరుగను: నా యజమాని నన్ను ఏనాటికైనా అట్లాంటి కొలిమిలో వేసి కాల్చగలడని అనుకోలేదు నేను ఆనాటి వరకూ. 'వేడి భయంకరంగా ఉంది! కొలిమిలో నుండి నన్ను బయటికి తియ్యి" అని గట్టిగా అరిచాను కొలిమిలోంచే. "అప్పుడే వదిలేయలేను" అని కొలిమి బయట నిలబడి అతను అంటుండటం గమనించాను నేను.

తర్వాత చాలా సేపటికి నన్ను కొలిమిలోంచి తీసి బయట పెట్టాడతను. 'బాగుంది. ఇక్కడ నాకు చాలా బావుంది' అని అనుకుంటుండగానే నన్ను తన చేతిలోకి తీసుకుని రంగులు వేయడం మొదలు పెట్టాడు. ఆ వాసనలు ఎంత ఘోరంగా ఉన్నాయో చెప్పలేను. వాటిని భరించలేక "ఆపు! ఆపు! ఆ రంగులు నా పైన చల్లకు!" అని అరిచాను. అయినా అతను పట్టించుకోలేదు. "అప్పుడే వదిలేయలేను" అని సమాధానం ఇచ్చాడు.

రంగులు వేసాక అతను నన్ను మళ్ళీ ఓసారి కొలిమిలో పెట్టాడు. ఆ కొలిమి ఇంతకు ముందు దానంత వేడిగా లేదు- దాని కంటే రెట్టింపు వేడిగా వుంది! నాకు చాలా ఉక్కగా కూడా ఉండింది అక్కడ. నేను మా యజమానిని ప్రార్థించాను, ప్రాధేయపడ్డాను, ఏడ్చాను, అరిచాను- బయటకు తీయమని. ఎప్పటిలాగే తన నుండి "అప్పుడే వదిలేయలేను" అని సమాధానం వచ్చింది.

ఇక నేను ఆశలన్నిటినీ వదిలేసుకున్నాను. ఇంక బయటపడలేనని నిశ్చయించు-కున్నాను. అలాంటి సమయంలో నా యజమాని నన్ను బయటకు తీసి ఒక అరలో

పెట్టాడు. ఒక గంట తర్వాత నన్ను నేను చూసుకునేందుకు ఒక అద్దం ఇచ్చాడు. నేను ఎట్లా తయారయ్యానో చూసుకుని నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను- నేను ఇట్లా అద్భుతంగా మారి పోయి ఉన్నాను మరి!"


ఆ సమయంలో మా యజమాని నాతో ఏమన్నాడో ఇక్కడ చెప్పాలని అనుకుంటున్నాను..

"నేను నిన్ను తొక్కాను, గుండ్రంగా తిప్పాను. నేను అలా చేయకపోతే నువ్వు ఒక మట్టిముద్దలా మిగిలి ఎండి పోయేదానివి . నేను నిన్ను కాల్చాను, నేను అలా చేయకపోతే నీకు ఇంత గట్టిదనం వచ్చేది కాదు, తాకితే పగిలిపోయే పదార్థంగా మిగిలిపోయేదానివి. నేను నీకు వేసిన రంగులు చెడు వాసనలని వెదజల్లి ఉండవచ్చు,కానీ నేను అలా చేయకపోతే నీ జీవితంలో రంగు లేకుండా అందవిహీనంగా కనపడేదానివి. నేను రెండోసారి నిన్ను కొలిమిలో ఎందుకు పెట్టానంటే నీకు మరింత గట్టిదనాన్ని ఇవ్వడానికి. నువ్వు ఇప్పుడు ఒక అందమైన రూపానివి. మొదట నేను ఏదైతే నీలో చూసానో ఇప్పుడు నిన్ను అలాగే తీర్చిదిద్దాను.

కష్టాలు వచ్చాయని ఎప్పుడూ బాధపడకూడదు. అవి వచ్చేది నిన్ను మరింత బలంగా, మరింత గట్టిగా, మరింత అందంగా తయారు చేసేందుకే!"

రాము : సోమూ! నీ ఉత్తరం అందినదిరా!
క్రింద లైను 'నాట్' అని రాశావే
అది ఏమిటో అర్థం కాలేదురా!

సోము : నీవు రాసే ఉత్తరం చక్కగా
గుండ్రని అక్షరాలతో రాయిరా!
అని అర్థం! ....



బొమ్మకు కథ రాయండి

నిర్వహణ: శ్రీమతి జి.లలిత, telugu4kids.com

ఈ బొమ్మను చూడండి..



బొమ్మలో చిన్నారి చక్కగా తయారై ఎక్కడికో నడుచుకుంటూ పోతున్నది.

ఎక్కడికి పోతున్నదో, ఏమో?

ఇది అడవా, లేకపోతే మరి తోటా?

ఈ చిట్టిపాప ఒక్కతే వెళ్తున్నదేంటి?

ముఖం కనబడటంలేదు- మరి ఈ పాప సంతోషంగా ఉందో, లేకపోతే బాధ పడుతున్నదో తెలీటంలేదే!

ఏదో ఆలోచిస్తున్నదేమో! లేకపోతే బహుశ: ఏ కుందేలు వెనకో పోతున్నదేమో, చప్పుడు చేయకుండా!

కొంచెం శ్రద్ధగా మనసు పెట్టి చూశారంటే మీకు నిజంగా తెలిసిపోతుంది- ఈ పాప కథ. ఆ కథని మాకు రాసి పంపించెయ్యండి తొందరగా. బాగున్న కథని కొత్తపల్లిలో ప్రచురిద్దాం!

మా చిరునామా: కొత్తపల్లి ట్రస్టు, యం.ఆర్.వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా-515 101, ఆంధ్రప్రదేశ్.

ఎలినోర్ హార్డ్విక్

యువ కెరటాలు



ఇటీవలి కాలంలో మంచి పేరు తెచ్చుకున్న ఒక ఫోటోగ్రాఫర్, సెట్ డిజైనర్ ఎలినోర్ హార్డ్విక్. ఎన్నో ప్రముఖ పత్రికల్లో ఆ అమ్మాయి తీసిన ఫోటోలు ప్రత్యేక గుర్తింపు పొందాయి. ఎందరో ప్రముఖ మోడళ్ళకు ఫోటో షూట్లు నిర్వహించింది ఆమె. బీబీసీ రేడియో వంటి అంతర్జాతీయంగా పేరు ఉన్న సంస్థలు, ప్రముఖ పత్రికల్లో ఆమె ఇంటర్వ్యూలు కూడా వచ్చాయి. ఇంతా చేసి ఆ అమ్మాయి వయసు ఇరవై ఏళ్లే! ఆ అమ్మాయి గురించే ఈసారి ఒక చిన్న పరిచయం.

1993 లో ఇంగ్లండులో పుట్టిన ఈ అమ్మాయికి చిన్నప్పటి నుండి మనుషుల బొమ్మలు గీయడం అంటే ఇష్టమట. పన్నెండేళ్ళ వయసులో ఉన్నప్పుడు ఫోటోలు తీయడం మీద ఆసక్తి కొద్దీ, కెమెరా తీసుకుని తనకి తెలిసిన అందరి ఫోటోలు తీస్తూ, వాటిని ఫ్లికర్.కాం వెబ్సైటులో అప్లోడ్ చేస్తూ ఉండేది. మొదట్లో మామూలుగా ఉన్నా కూడా క్రమంగా ఆ ఆసక్తి కాస్తా కొంచెం సీరియస్‌గా మారి, ఫ్యాషన్ ఫోటోగ్రఫీ వైపు మళ్ళింది. కొత్త విషయాలు నేర్చుకుంటూ, కొత్త ఫోటోలతో ప్రయోగాలు చేస్తూ అంతర్జాలంలో అప్లోడ్ చేస్తూ ఉండగా, ఒక రెండు మూడేళ్ళ తరువాత ఒకసారి ఇవి గమనించిన కొందరు పత్రికల వాళ్ళు ఆవిడని ఇంటర్వ్యూ చేసారు. ఆ ఇంటర్వ్యూలు ప్రచురితం అయ్యాక హార్డ్విక్ ఫోటోల గురించి అందరికీ తెలిసి, కొందరికి నచ్చి - వాళ్ళు తమ ప్రకటనల కోసం ఫోటోలు తీయమని అడగడం మొదలుపెట్టారట. అప్పటికే ఆ రంగం మీద విపరీతమైన ఇష్టాన్ని ఏర్పరుచుకున్న ఆమె కష్టపడి పనిచేస్తూ, ఆవిధంగా, పద్దెనిమిదేళ్ళ వయసు వచ్చేసరికే ఫోటోగ్రాఫర్ గా నిలదొక్కుకుంది. ఎంతో పేరు సంపాదించింది.

ఇప్పుడు హార్ద్విక్ ఒక బిజీ ఫోటోగ్రాఫర్. ఆర్ట్ ఎగ్జిబిషన్లు, వ్యాపార ప్రకటనలకి ఫోటో షూట్లు, ప్రముఖ మాడల్స్ తో కలిసి పనిచేయడం, ఇలాంటివి అనేకం చేస్తూ నిత్యం తీరిక లేని జీవితం గడుపుతోంది. అలాగని తన ఈడు వాళ్లకి సంబంధం ఉండే పనులేవీ చేయదని కాదు. రూకీ అని అమెరికాలోని టీనేజ్ అమ్మాయిల కోసం ఒక పత్రిక ఉంది. ఆ పత్రికలో ప్రముఖ రచయితలే కాక అనేక టీనేజ్ పిల్లలు కూడా రచనలు చేస్తూ ఉంటారు. హార్ద్విక్ కూడా ఈ పత్రికలో తరుచుగా ఫోటోలు ప్రచురిస్తూ ఉంటుంది. తన ఈడులో పిల్లలు ఎలా ఉంటారో, ఇలాంటివి ఇష్టపడతారో, ఎలా ఆలోచిస్తారో - అవే తన ఫోటోలలో ప్రతిబింబించాలని ఆమె అభిప్రాయం. తన చుట్టూ పక్కల ఉండే పల్లె ప్రాంతం, తను చదివే పుస్తకాలు వంటి వాటి నుండి స్ఫూర్తి పొందుతానని ఒక ఇంటర్వ్యూ లో చెప్పింది. తనకి ఫోటోగ్రఫీ అంటే ప్రాణమనీ, తను ఇదే రంగంలో కొనసాగి ఇంకా ఎన్నో సాధించాలి అనుకుంటున్నా అని కూడా చెప్పింది. అన్నట్లు ఈ అమ్మాయికి మన భారతదేశం చాలా నచ్చిందట. ఎప్పటికైనా ఇక్కడికి వచ్చి ఫ్యాషన్ షూట్ చేయాలని కోరికట. ఒక ఇంటర్వ్యూ లో - "నీకు స్ఫూర్తి నిచ్చే స్టయిలు ఎవరిది?" అని అడిగితే "భారత దేశంలోని బంజారాలది" అని కూడా చెప్పింది!

ఇంత చిన్న వయసులో ఇంత పేరు ప్రఖ్యాతులు రావడం గొప్ప అయినా - తనకి నచ్చిన అంశం గురించి ఆ అమ్మాయి బాగా కష్టపడి పనిచేసింది, చేస్తోంది అన్నది కూడా నిజమే! మనం అందరం కూడా మనకు నచ్చిన అంశాల మీద కష్టపడి పని చేద్దాం, సరేనా?

తెలుగు బాల

సాధు సంగమమున సామాన్యుడును గూడ మంచి గుణములను గ్రహియించుచుండు పుష్ప సౌరభంబు పొందదా దారంబు? లలిత సుగుణజాల! తెలుగుబాల!	విరుల జేరి హరుని శిరసు నెక్కిన చీమ చందమామతోడ సరసమాడె ఉత్తమాశ్రయమున ఉన్నత స్థితి గల్గు లలిత సుగుణజాల! తెలుగుబాల!

సమీక్ష

కొత్తపల్లి కథల పుస్తకం-56 పై ఒక సమీక్ష. *నిర్వహణ: శ్రీమతి మాలతీకృష్ణ, విజయవాడ.*



కల్మషం లేని పసిపాపలాంటి నవ్వుతో, వీపు మీద కానుకలనే ప్రేమని పిల్లలందరికీ పంచడానికి వచ్చిన శాంతాక్లాజ్ దర్శనం హాయిగా వుంది. కొత్తపల్లి కూడా నెలనెలా పిల్లలకోసం వచ్చే శాంతా క్లాజ్.

ఈ సందర్భంగా ఓ సంగతి. చాలా ఏళ్ళుగా ఎంతోమంది పిల్లలతో గమనించాను- వాళ్ళకు 'దేవుడున్నాడా, దెయ్యాలుంటాయా' కంటే 'శాంతాక్లాజ్ వుంటాడా' అనే సందేహమే ఎక్కువగా వస్తుంది. నిజంగా శాంతాక్లాజ్ వుంటాడు కదూ? అనడంలో 'ఉంటే బాగుండు - ఉండాలి - లేదంటే నాకిష్టం వుండదు' అనే అర్థం స్ఫురిస్తుంది. ఎప్పుడైనా అది కల్పన అని గనక అంటే - చెప్పనంత బాధ, ఆ చిన్ని కళ్ళల్లో! అలాంటి అందమైన ఊహలని, ఆశలని ప్రేమతో నిజం పేరిట చెడగొట్ట కూడదనిపిస్తుంది.

ఈ సారి కథల విషయానికొస్తే-

'పిడుదు రంగయ్య' క్రొత్తగా వుంది. జ్యోతి మంచి కథని సేకరించింది. కాకపోతే 'పిడుదు' ఎవరో అస్సలర్థంకాలేదు*. నవీన్ కుమార్ సేకరణ 'త్యాగశీలి' ఎక్కడిదో గానీ మంచి విషయాన్ని క్లుప్తంగా, సూటిగా చెప్పింది. అయితే 'త్యాగశీలి' అనే టైటిల్ రాజసేఖరుడితో పాటు, అతనికి మంత్రం బోధించిన మనిషికి కూడా వర్తిస్తుందనిపించింది. డి.జ్యోతి వ్రాసిన 'సీసాభూతం' భూతాలు,

దెయ్యాలు ఒట్టి మొద్దుబుర్రని తేల్చింది. భూతాలకి పొడుపు కథలు కలపడం సరదాగావుంది.

హరికిషన్ గారి 'పిరికిదయ్యం' నిజంగా అంత తెలివి తక్కువది కాదు పాపం, అన్న ఒట్టి దద్దమ్మన్న సంగతిని బాగానే కనిపెట్టిందిగా! కథ నిజంగానే తమాషాగా వుంది. శంకరరావుగారి మ్యాజిక్ కథలు ప్రయోగాత్మకంగా, ప్రయోజనాత్మకంగా వున్నాయి. తీసుకున్న అంశాలను కథలుగా అల్లడంలో ఆయన కృషిని అభినందించాలి.

లలితగారు ఈసారి ఇచ్చిన బొమ్మకు కథ అల్లడం సవాలే అనిపించింది. పిల్లల సృజనాత్మకత దీనికి ఎలా స్పందిస్తుందో చూడాలి.

'విజ్ఞానం' శీర్షికని సమతగారు రెగ్యులర్‌గా అందించబోతున్నారా? మంచి ప్రయత్నమే గానీ, మన సైన్సుపాఠాల మాదిరి మారకుండా వుండేలా చూసుకోవడం అవసరం. ఏ విషయాన్నయినా ఆసక్తికరంగా అతి సులువుగా పిల్లలకందించడంలో అమెరికన్, చైనీస్ పుస్తకాలు మంచి నమూనాలు కాగలవు.

కొన్ని కథలు 'ఇదేమిటి? - ఇలా వ్రాశారు? కొంచెం ప్రయత్నించి ఆసక్తికరంగా వ్రాస్తే బాగుండేదే' అనిపించాయి.

ఇక కొత్తపల్లి వారి 'ఉన్ని' కీ, కామా(,)లకీ అలవాటు పడిపోయాం. వాటి గురించి చెప్పడం కంటే - 'కొత్తపల్లి బృందం వాటిని అలానే కొనసాగించాలనుకుంటోంది' - అనుకోవడంలో సుఖముందనిపించింది!

క్రొత్త సంవత్సరంలో మరెంతో మంది పిల్లలు మరిన్ని క్రొత్త క్రొత్త కథలని వ్రాసేసి కొత్తపల్లి వేదికని పూర్తిగా వినియోగించుకోవాలని, మరెంతో మంది పిల్లలకి స్ఫూర్తికావాలనీ ఆశిస్తూ-

అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు.

*పిడుదు అనేది పశువులను పట్టుకొని రక్తం తాగే పేను లాంటి ఒక జీవి! -సం.

పదరంగం-23

ఈ పదరంగం చాలా సులభం! దీన్ని ఓ పోస్టు కార్డులో పూరించి పంపండి. మీ పేరుతో బాటు మీ బడి పేరు, తరగతి తప్పక రాయండి. సరైన సమాధానాలు పంపిన పిల్లల పేర్లను పదరంగం-24 తోపాటు ప్రచురించగలం. నిర్వహణ: కొత్తపల్లి.

1		2	3		4
		5			
6	7			8	
	9		10		
11			12	13	14
15				16	

నిలువు:

1. పుస్తకాల్ని బాగా... (3)
2. కాకికి ఇదంటే చాలా ముద్దు (4)
3. రావణాసురుడు సీతమ్మను ఉంచిన నగరమేనా? (2)
4. వాన చుక్క (3)
7. 'వలు' అని రెండు సార్లు అంటే 'బట్టలు' అని అర్థం (4)
10. బెక బెక మనేది తిరగబడింది (2)
11. చిట్టి అమ్మాయి (2)
13. పన్నెండు అడ్డమే, వ పోయి తలక్రిందులైంది (2)
14. చేపల్ని పట్టేందుకు జాలర్లు నీళ్ళలో పరచేది (2)

అడ్డం:

1. ఈ కాలం! (4)
5. కాకిపిల్ల వాళ్ళమ్మ, అటునుండి (2)
6. అటునుండి పిలువు (3)
8. చెట్టుకి ఆహారంతయారు చేసిపెట్టేది! (2)
9. వానా వానా...!(3)
11. సంపూర్ణాహారం! (2)
12. నీళ్ళలో ఉండే ఈ పువ్వుకి చంద్రుడంటే ఇష్టం! (3)
15. ఇదంటే గాలి అని అర్థం (3)
16. నిద్రలోనే వచ్చేది! (2)

పదరంగం 22కు

సరైన జవాబు ➡



రాసి పంపిన పిల్లలు:

1. తరుణి, 5వతరగతి, ప్రభుత్వప్రాథమికపాఠశాల, గడ్డంనాగేపల్లి, నార్పల.
2. జయ ఆదిత్య, 4వతగ్గతి, శ్రీచైతన్యటెక్నోస్కూల్, కోర్ట్‌రోడ్, A.T.P.
3. సాయివైష్ణవి, 7వతరగతి, కేశవరెడ్డికాన్సెప్ట్‌స్కూల్, అనంతపురం.

చిలిపి ప్రశ్నలు

రచన: శ్రీవి.వి.యస్.మూర్తిగారు, చొదిమెళ్ళ, విజయవాడ.

1. టెన్నిస్ ఆటగాడు క్రికెట్ ఆడితే ఏం చేస్తాడు?

జవాబు: బాల్ కోసం పరుగెత్తకుండా జేబులో నుంచి బంతి తీసి వికెట్ల మీద విసురుతాడు

2. వేపపువ్వు లేకుండా ఉగాది పచ్చడి ఎక్కడ చెయ్యచ్చు?

జవాబు: టి.వి. వంటల కార్యక్రమంలో.

3.కలికాలపు భక్తురాలు స్వామిని ఏ కాలంలో ఏమని వేడుకుంటుంది?

జవాబు: వేసవిలో - "చల్లగా చూడు స్వామీ" అని, చలికాలంలో "వెచ్చగా చూడు స్వామీ " అని వేడుకుంటుంది.

4. దురాశా పరుడు కొడుక్కి ఏం నేర్పిస్తాడు..?

జవాబు: ఒకట్లు, పదులు నేర్పకుండా లక్షలు, కోట్లు నేర్పిస్తాడు

5. డాక్టరు ఖంగు తినేదెప్పుడు?

జవాబు: "నా గురక వల్ల నాకు నిద్రపట్టటం లేదు" అనే పేషెంట్ ఎదురైనప్పుడు.

6. ప్రదక్షిణలు చెయ్యలేని భక్తుడి శనిదోషం ఎలా పరిహారమౌతుంది?

జవాబు: ప్రదక్షిణ చెయ్యలేకపోతేనేమి, దక్షిణ వేస్తే చాలు- దోషం మటుమాయం!

7. హాస్యనటుడి బ్రెయినుకు ఏమైందట?

జవాబు: ఆయనకు "బ్రెయిన్ హ్యూమర్"వచ్చిందట, పాపం.

జండా పాట

రచన: కొత్తపల్లి సురేష్ (పోస్టు ద్వారా)



మూడు రంగుల మన జెండా
ముచ్చటైన మన జెండా
ఆకాశంలో
ఆనందముతో ఎగురుచున్నది
జై జై జెండా జై భారత జెండా
జై జై జెండా జై భారత జెండా
"ఆకాశంలో"

నడుమున శ్వేత వర్ణమట
శాంతికి అదేమొ చిహ్నమట
పైన కషాయ వర్ణమట
శౌర్యానికి అది గురుతంట
అడుగున ఆకు పచ్చంట
పచ్చని పైరుల పంటంట
"ఆకాశంలో"

మౌర్య అశోకుని చక్రమట
ధర్మానికి అది నెలవంట
మహాత్మగాంధి కల అంట
ప్రపంచాన ఇది వెలుగంట
పింగళి వెంకయ్య స్ఫూర్తంట
తెలుగు నేలకే గర్వమట

"ఆకాశంలో"

భాస్కరుని మాట

ఊరక సజ్జనుండొ దిగియుండిన నైన దురాత్మకుండు ని-ష్కారణ మోర్వలేక యపకారము చేయుట వాని విద్యగా చీరెలు నూరు టంకములు చేసెడి వైనను బెట్టె నుండగా జేరి చినింగి పోగొరుకు చిమ్మట కేమి ఫలంబు భాస్కరా?

ముఖ్యమైన పదాలు

ఊరక=ఊరికే, సజ్జనుండు=మంచివాడు, ఒదిగి యుండుట=అణకువతో ఉండటం, దురాత్మకుండు=చెడ్డవాడు, నిష్కారణం=అకారణంగా, టంకం=రూపాయి, చిమ్మట=కీచురాయి, పెట్టెలో వస్తువుల్ని కొరికి తినేసే కీటకం.

పెట్టెలోకి చేరి, కొరికి చిల్లులు పెట్టేసే చిమ్మట, 'ఆ చీర ఖరీదెంత' అని చూడదు. అట్లాగే, ఓర్వలేక అపకారం చేసే దుర్మార్గుడు 'మనం మంచివాళ్లమా, ఊరికే అణకువతో ఉన్నామా' అని చూడడు. మన జాగ్రత్తలో మనం ఉండాల్సిందే!

ముద్రిత ప్రతుల వెల: ప్రతి ఒక్కొంటికి: 25 రూ.
12 పుస్తకాలకై చందా: **రూ. 300/-**

"కొత్తపల్లి ట్రస్టు" పేరిట యంవో/డిడిని ఈ చిరునామాకు పంపండి: కొత్తపల్లి ట్రస్టు, యంఆర్‌వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా- 515101, ఆంధ్రప్రదేశ్.
బ్యాంకు అక్కౌంటు వివరాలు:
"Kottapalli Trust", A/c No. 0138101018809 (savings), Canara Bank, Chennekothapalli. IFSC: CNRB0000138

ఫోన్లు: 08559 240222, 7702877670
ఇ-మెయిలు: team@kottapalli.in

ఈ నెలలో ఏపని-ఎవరిది?

ఆర్థిక వ్యవహారాలు, నిర్వహణ: సుబ్బరాజు
సంపాదకత్వం: నారాయణ
వెబ్సైటు, సాంకేతికత: ఆనంద్, లక్ష్మి
ముద్రణ: 'ముద్రిక' కృపాకరరావు
ముఖచిత్రం 'సంక్రాంతిముగ్గు': వీరాంజి
చిత్రాలు: అడవి, ప్రసాద్, లక్ష్మీవెంకట్, చందు, శ్రీధర్, పూర్ణ.
కథలు, పాటలు: చాలామంది పిల్లలు

ప్రత్యేక కృతజ్ఞతలు: రిషివ్యాలీ రూరల్ స్కూలు వారికి, అరవిందాహైస్కూల్ వారికి, ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల బద్దలాపురం వారికి, మ్యాజిక్ కథల శంకర శివరావు గారికి, 'విద్యార్థి' మాలతీకృష్ణగార్లకి, జిల్లాపరిషత్ పాఠశాల, ప్రాథమిక పాఠశాల తరాలపల్లి వారికి, కార్టూనిస్టు ఏవియం గారికి, రాధా రాజశేఖర్ గార్లకి, కంప్యూటర్లలో లైనక్సు వ్యవస్థను చక్కగా అందిస్తున్న ఉబుంటు వారికి, జింప్, అడాసిటీ తదితర ఓపెన్ సోర్సు సాఫ్టువేరు నిర్మాతలకు, ఇంకా పేర్లు రాయని అనేకమందికి.

పిల్లల్లో సృజనాత్మకత సహజం. కథలు, ఆటలు, పాటలు, బొమ్మలు దానికి ఊతాన్నిస్తాయి. మాతృభాషలో ఇష్టంగా చదవటం, తేలికగా రాయటం వస్తే అటుపైన అన్ని శాస్త్రాలూ సులభంగా వంటపట్టుతాయి-నిజం! అందుకని మీ పిల్లల్లో ఉన్న కాల్పనిక శక్తికి పదును పెట్టండి. వాళ్లను కథలు రాసేందుకు, పాటలు పాడేందుకు, బొమ్మలు వేసేందుకు ప్రోత్సహించండి. వాళ్ళ రచనల్ని మాకు పంపండి. కావాలనిపిస్తే మీరే ఇలాంటి పత్రికనొకదాన్ని మొదలు పెట్టండి- ఎలాగైనా సరే- పిల్లలు పెద్దవాళ్లయ్యేలోగా వాళ్ళు చాలా చాలా తెలుగు కథల్ని చదివేలా, రాసేలా చేయండి. మీ పిల్లలకు ఈ పత్రికలోని కథలు నచ్చుతాయనే మా నమ్మకం- వీటిని వీలైనంత మందితో పంచుకోండి. మీరు రాసిన పిల్లల కథలు ఏమైనా ఉంటే పనిగట్టుకునైనా సరే, మాకు పంపండి. వీలు చేసుకొని ప్రచురిస్తాం.

[మంచి పుస్తకం:](#)

మాయ గుర్రం- మేటి గుర్రం

వావ్! అద్భుతమైన కథ! చాలా ఏళ్ళ క్రితం, మేం చిన్నగా ఉన్నప్పుడు రష్యా దేశం నుండి వచ్చిన పుస్తకాలుండేవి కొన్ని లైబ్రరీల్లో- వాటిలో తెలుగు చాలా వింతగానూ, క్రొత్తగానూ ఉండేది. అయినా వాటిని మేం ఎగబడి, పడి పడి చదివేవాళ్లం- అంత బాగుండేవి ఆ కథలు మరి!

'మంచి పుస్తకం' వాళ్ళు ఆ కథల్ని ఒక్కటొక్కటిగా మళ్ళీ ప్రచురించి పుణ్యం కట్టుకుంటున్నారు. తాజాగా 'మాయగుర్రం మేటి గుర్రం' మళ్ళీ చదివే అవకాశం చిక్కింది మాకు.


ఏం కథ! ఏం కథ! ఏం కథనం! ఎన్ని సార్లు చదివినా మళ్ళీ చదవగలిగే కథనం!

పిల్లలు సమయం తీసుకొని చదువుతారు, పెద్దవాళ్ళు తొందరగా చదువుతారు- కానీ ఇద్దరూ ఇష్టపడతారు ఈ కథని- పెద్దలకిది తెలిసిన కథే కావొచ్చు; అయినా.

మాయగుర్రం కథతో బాటు ఈ పుస్తకంలో 'మత్స్య మిత్రుడి మంత్ర మహిమ' కథ కూడా ఉంది.

మాయ మంత్రాల కథలు పిల్ల మనసుల్ని ఊహలతో నింపుతై. ఆ ఊహలకు ఇలాంటి కథలు రెక్కలనిస్తై. రెక్కలొచ్చి ఎగిరే మనసులు స్వతంత్రంగా ఆలోచించటం మొదలు పెడతై..పిల్లలు చక్కగా ఎదిగేందుకు ఇవన్నీ నిజంగానే దోహదం చేస్తై.


మంచి పుస్తకం వారి మరో మంచి పుస్తకం ఇది. బాగుంది, చదివి చూడండి అందరూనూ.



ప్రచురణ: మంచి పుస్తకం

వివరాలకు: 9490746614

పెద్ద పేజీలు: 52   వెల: రూ. 55/-



కథలెందుకు?

"ప్రపంచం అంతా పాడయిపోతోంది" బాధగా వొచ్చాడు వెంకటేశు.

"ఏమైంది?" అన్నా.

"ఇదిగో చూడు, దేశాలూ దేశాలూ వ్యాపారం పేరిట ఇట్లా కొట్టుకుంటున్నాయా, ఇంక యీ పాడు డబ్బుల కోసం మనదేశంలో ఎంత మంది నాయకులు ఎన్ని రకాలుగా గడ్డి మేస్తున్నారో చూడు! జనాలేమో ఆ మోసాల్నే ఒంట పట్టించుకొని, ఎవరు తమకు నాలుగు డబ్బులు ఇస్తే వాళ్ల ముందు క్యూ కట్టి నిలబడుతున్నారు" అన్నాడు వెంకటేశు.

"నిజమే. అయితే ఏం చేద్దాం? అయినా ఆ జనాల్లో నువ్వూ - నేనూ కూడా ఒకళ్లం, తెలుసుగా?" అన్నాను నేను.

వెంకటేశు తెల్లబోయి చూశాడు.

"చూడు వెంకటేశూ, ఆత్మాభిమానం వొదిలేస్తే తప్ప ఎవరైనా ఇంకోళ్లకి దాసోహం కాలేరు. రానురాను మనందరిలోనూ ఆత్మాభిమానం పూర్తిగా చచ్చిపోతున్నదని నా అనుమానం.. ఏమంటావు?" అన్నాను నేను.

"నిజమే అనుకో, అయినా దీనిలోంచి బయటపడేదెట్లాగ? గొణిగాడు వెంకటేశు.

"బాగా చదవాలి. ఆలోచించాలి. ధైర్యం తెచ్చుకొని నచ్చిన పని చెయ్యాలి. ధైర్యానికి మన జీవితాల్లో తావివ్వాలి. మరీ ఎక్కువ సర్దుకుపోకూడదు. మంచి గురించి; నీతి-అవినీతి గురించి; నియమబద్ధంగా బ్రతకటం గురించి; విలువల్ని నిలుపుకోవటం గురించి మాట్లాడుతుండాలి. ఆత్మగౌరవాన్ని చేజారకుండా ఉంచుకునేదెలాగో చెబుతుండాలి మళ్లీ మళ్లీ. ఆ విలువలు ఎంతమందిలో నిలిస్తే- రానున్న కాలంలో లోకం అంత బాగుంటుంది."

"ఓహో! మళ్లీ కొత్తపల్లి పుస్తకాలలోకి వచ్చావా?" నవ్వాడు వెంకటేశు.

"అవును- మంచి ఆలోచనలు రేకెత్తించటానికి కథల్ని మించిన మాధ్యమాలు మరేమున్నాయి?" అన్నాను నేనూ నవ్వేస్తూ.

Published by Narayana for Kottapalli Trust, Near M.R.O.Office, Chennekothapalli-515101, Ananthapur District, AP. Ph:08559 240222 E-mail: team@kottapalli.in and printed at Mudrica Offcet Printers, Vijayawada, Phone:08662579129